జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్తు, దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523



సంపుటి 15 సంచిక 114 విశాఖపట్నం | శుక్రవారం 07 జనవరి 2022 | 8 పేజీలు | వెల : 5.00


## రెవిన్యూ లోటు కింద రూ.9,871 కోట్ల నిధులను విడుదల చేసిన కేంద్రం



అమరావతి: కేంద్ర ఆర్థిక శాఖ రెవిన్యూ లోటు కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ. 1.438.08 కోట్లు నిధులను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ సహా 17 రాష్ట్రాలకు గురువారం రూ. 9,871 కోట్లను విడుదల చేసింది. ఇందులో ఏపీకి సంబంధించి రూ. 1,438.08 కోట్లు కేటాయించినట్లు కేంద్ర ఆర్థిక శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

### వివేకా హత్య కేసులో సీబీఐకి హైకోర్టు ఆదేశాలు

అమరావతి: వివేకా హత్య కేసులో సీబీఐకి ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దస్తగిరిని అప్రూవర్‌గా మారుస్తూ సీబీఐ తీసుకున్న నిర్ణయాన్ని కొట్టివేయాలంటూ గంగిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. గంగిరెడ్డి పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. వివేకా కేసులో ఇప్పటివరకు నమోదు చేసిన సాక్షుల వాంగ్మూలాన్ని కోర్టుకు అందజేయాలని సీబీఐకి ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. ప్రాథమిక అభియోగ పత్రం కూడా కోర్టుకు అందించాలని హైకోర్టు సీబీఐకి ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణ ఈ నెల 20కి వాయిదా పడింది.

## పీఆర్సీపై...

# రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తాం

## ముఖ్యమంత్రి జగన్



అమరావతి:ఉద్యోగులకు ఎంత మంచి చేయగలిగే అంత మంచి చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఉద్యోగ సంఘాలు చెప్పిన అంశాలను స్వయంగా నోట్ చేసుకున్నానని తెలిపారు. అన్నింటినీ స్ట్రీమ్‌లైన్ చేయడానికి అడుగులు ముందుకేస్తామని, మెరుగ్గా చేయగలిగే దిశగా ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. దయచేసి అందరూ ప్రాక్టికల్‌గా ఆలోచించాలని ఉద్యోగ సంఘాలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మోయలేని భారాన్ని మోపకుండా కాస్త సానుకూల దృక్పథంతో ఉండాలని సూచించారు. అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తామని, మంచి చేయాలన్న తపనతో ఉన్నామని తెలిపారు. 2, 3 రోజుల్లో దీనిపై ప్రకటన ప్రకటన చేస్తామని వెల్లడించారు.

(మిగతా 2లో..)

## మోడీ భద్రత వైఫల్యానికి

# బాధ్యులు ఎవరు..?

### సుప్రీంలో పిటీషన్..



ఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పంజాబ్ పర్యటనలో భద్రతా వైఫల్యానికి బాధ్యత ఎవరిది..? పవర్‌ఫుల్ పీఎం కాన్వాయి 20నిమిషాల పాటు ఫ్లై ఓవర్‌పై నిలిచిపోవడం వెనుక అసలేం జరిగింది..? అడుగడుగునా పహారా.. డేగ కళ్ల నిఘా మధ్య సాగే ప్రధాని పర్యటనలో ఇంతటి భద్రతా వైఫల్యానికి కారణం ఎవరు..? సెక్యూరిటీ రీజన్స్‌తో మోడీ పర్యటన రద్దవడం సంచలనంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. అయితే.. ఇప్పుడీ ఘటన సుప్రీంకోర్టుకు చేరింది. ప్రధాని పర్యటనలో భద్రతా లోపంపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు న్యాయవాది మణిందర్ సింగ్. అసలేం జరిగిందో..ఇందుకు కారణమెవరో తేల్చాలని..అత్యున్నతస్థాయి విచారణ జరపాలని కోరారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం కేంద్రంతో పాటు పంజాబ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. దీనిపై శుక్రవారం విచారణ చేపడతామన్నారు సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ.మరోవైపు ప్రధాని పర్యటనలో భద్రతా వైఫల్యంపై ముగ్గురు సభ్యులతో హై లెవెల్ కమిటీని ఏర్పాటుచేసింది పంజాబ్ ప్రభుత్వం. మూడ్రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు సీఎం ఛన్నీ.

# ఏకపక్ష లవ్ సరికాదు: చంద్రబాబు



కుప్పం: వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయా..? ఎన్నికలకు చాలా సమయం ఉంది కదా.. ఇప్పుడెందుకు ఆ డౌట్ అనుకుంటున్నారా..?. మేము కాదండీ బాబు టీడీపీ కార్యకర్తలే జనసేనతో పొత్తు కావాలని కోరుకుంటున్నారు. కోరుకోవడం మాత్రమే కాదు.. ఏకంగా పార్టీ అధినేత చంద్రబాబును డైరెక్ట్‌గా కోరారు. అయితే చంద్రబాబు నుంచి ఊహించని సమాధానం వచ్చింది. 'లవ్ వన్ సైడ్ కాదు.. రెండు వైపులు ఉండాలి' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏకపక్ష లవ్ సరికాదని చంద్రబాబు చమత్కరించారు. టీడీపీ అధినేత కుప్పం పర్యటన సందర్భంగా ఈ ఇంట్రస్టింగ్ సీన్ కనిపించింది.మూడ్రోజుల కుప్పం పర్యటనకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు.. తొలిరోజు బిజీబిజీగా గడిపారు. అధినేతకు ఘనంగా స్వాగతం పలికాయి టీడీపీ శ్రేణులు. రోడ్‌షోలతో దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు చంద్రబాబు. రామకుప్పం మండలం రామకుప్పం మండలం అరిమానుపెంటలో రచ్చబండ నిర్వహించిన చంద్రబాబు గ్రామస్తులు, టీడీపీ కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించారు.కుప్పం పర్యటనలో సీఎం జగన్‌పై తీవ్ర విమర్శలు ఎక్కుపెట్టారు చంద్రబాబు. సొంత తల్లిని, చెల్లిని కూడా.. జగన్ రాజకీయంగా వాడుకుని వదిలేశాడని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును 71 శాతం టీడీపీ హయాంలోనే పూర్తి చేశామని చెప్పారు చంద్రబాబు. ఆ పనుల్ని కూడా తామే చేశామనీ.. వైసీపీ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మూడేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి మూడు ఇళ్లు కూడా నిర్మించలేదని విమర్శించారు చంద్రబాబు. అన్నింటా లూఠీ చేస్తున్నారనీ ప్రభుత్వ ఖజానా ఖాళీ చేశారనీ చంద్రబాబు ఆరోపించారు. ఏపీ ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి అప్పులు ఇచ్చేవాళ్ళు కూడా దొరకడం లేదని ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు రౌడీయిజం చేస్తున్నారనీ.. తాను అధికారంలో ఉన్నప్పుడు అలాగే ఆలోచించి ఉంటే కుప్పంలో ఆ పార్టీవాళ్లు ఒక్కరూ మిగిలేవారు కాదన్నారు చంద్రబాబు. తొలిరోజు పర్యటనలో రచ్చబండ, రోడ్‌షోలతో ప్రజలను కలిసిన చంద్రబాబు.. మరో రెండ్రోజుల పాటు కుప్పంలోనే ఉండనున్నారు.

## ఆందోళనకారుల వద్ద ఆగి ప్రధానికి భరోసా ఇచ్చిన పంజాబ్ సీఎం



చండీగఢ్: ఆందోళనకారుల తన కాన్వాయ్ ఆపి వారితో కాసేపు చర్చించారు పంజాబ్ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీ. బుధవారం పంజాబ్ వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, నిరసన కారణంగా ఓ వంతెనపై 20 నిమిషాలు ఆగారు. అయితే తన మార్గంలో భద్రతా ఏర్పాటులో వైఫల్యం ఉందన్న కారణంతో పంజాబ్‌లో జరిగే కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకుని తిరిగి ఢిల్లీకి వెళ్లారు. ఆ మరుసటి రోజే ముఖ్యమంత్రి చన్నీ కాన్వాయ్‌ను ఆందోళనకారులు . ఈ సందర్భంగా చన్నీ మాట్లాడుతూ "నేను వస్తుండగా నన్ను నిరసనకారులు ఆపారు. అయితే నేను వారిని చంపాలా? రైతులు వారి హక్కుల కోసం వారు ఆందోళన చేస్తున్నారు. వారికి ఎవరినీ అడ్డుకునే ఆపే ఉద్దేశం లేదు. నిరసనకారులకు ప్రధాని కాన్వాయ్‌కి కిలోమీటర్ దూరం ఉంది. అంత దూరం నుంచి ఎవరైనా ఆపగలరా? ప్రధాని కారును ఎవరూ ఆపరు. నిరసన చేయడం ప్రజాస్వామ్య హక్కు. ఒక వేళ వాళ్లు ఉద్యోగులు అయితే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ని పాటించాలి" అని చన్నీ అన్నారు.ఆందోళనకారులు కొంత దూరం నుంచి కాన్వాయ్‌ను ఆపారు. కాస్త దూరంలోనే తన కారు దిగిన చన్నీ.. నిరసనకారుల వద్దకు నడుచుకుంటూ వెళ్లారు. చన్నీ వస్తుండగా ఆందోళనకారులు పంజాబ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చన్నీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## పేర్ని నానిని కలుస్తా: ఆర్జీవి



అమరావతి: ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫి మంత్రి పేర్ని నానిని కలుస్తానని దర్శకుడు ఆర్జీవీ అన్నారు. ఈ మేరకు ఆయన వరుస ట్వీట్‌లు చేస్తూ.. 'పేర్ని నాని గారు ప్రభుత్వంతో గొడవ పెట్టుకోవాలి అన్నది మా ఉద్దేశం కాదు.. పర్సనల్‌గా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే నాకు చాలా అభిమానం. కేవలం మా సమస్యలు మేము సరిగా చెప్పుకోలేక పోవడం వల్లనో లేక , మీరు మా కోణం నుంచి అర్థం చేసుకోకపోవడం వల్లలో ఈ మిస్ అండర్ స్టాండింగ్ ఏర్పడింది' అంటూ ట్వీటర్‌లో రాసుకొచ్చారు. దీనికి కంటిన్యూగా మరో ట్వీట్ చేస్తూ.. 'కాబట్టి పేర్ని నాని గారు నా రిక్వెస్ట్ ఏంటంటే మీరు అనుమతిస్తే నేను మిమ్మల్ని కలిసి ఇండస్ట్రీ తరపు నుంచి మా సమస్యలకు సంబంధించిన వివరణ ఇస్తాను. అది విన్న తర్వాత ప్రభుత్వ పరంగా ఆలోచించి సరైన పరిష్కారం ఇస్తారని ఆశిస్తున్నాను' అంటూ వర్మ ట్వీట్ చేశారు. వర్మ ట్వీట్‌కి మంత్రి పేర్నీ నాని రిప్లై ఇస్తూ .. 'ధన్యవాదాలు రామ్ గోపాల్ వర్మ గారు.. తప్పకుండ త్వరలో కలుద్దాం' అని ట్వీట్ చేశారు.



## సివిల్స్ మెయిన్ ఎగ్జామ్ వాయిదాకు హైకోర్టు తిరస్కరణ

న్యూఢిల్లీ : సివిల్ సర్వీసెస్ (మెయిన్) ఎగ్జామ్స్‌ను వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు గురువారం తోసిపుచ్చింది. కోవిడ్-19 కేసులు పెరుగుతున్నప్పటికీ, ఈ పరీక్షల షెడ్యూలులో జోక్యం చేసుకోబోమని తెలిపింది. దీంతో ఈ పరీక్షలు శుక్రవారం నుంచి ముందుగా ప్రకటించినట్లుగానే జరుగుతాయి. సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహిస్తుంది. తాము కోవిడ్-19 పరిస్థితిని క్షుణ్ణంగా సమీక్షించామని బుధవారం తెలిపింది. షెడ్యూలు ప్రకారం శుక్రవారం నుంచి ఈ పరీక్షలు జరుగుతాయని ప్రకటించింది.

(మిగతా 2లో..)







## జూదాగాళ్ళకు సింహ స్వప్నం ఉంగుటూరు ఎస్సై
## జూదం ఆడితే సహించేది లేదు




గన్నవరం ప్రజా పాలన ప్రతినిధి జనవరి06: ఉంగుటూరు మండలంఉంగుటూరుపోలీసులు మూడు గ్రామాల్లో. పేకాట శిబిరాల పై మెరుపు దాడులు చేపట్టారు. ఉంగుటూరు ఎస్ ఐ రాజు తన సిబ్బంది తో కొయ్యగూరపాడు, ఇందుపల్లి చాగంటిపాడు గ్రామాల్లో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. మూడు గ్రామాల్లో కలిపి 10 మంది పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారుగా 16580/- నగదును స్వాధీనం చేసుకున్నారు నిందితులను పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ దాడుల్లో కొయ్యగూరపాడు గ్రామంలో పెద్ద మొత్తంల సుమారు 14,000 నగదు స్వాధీనం చేసుకున్నారు.

## రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తాను కూడా మీ అందరి కుటుంబ సభ్యుడినని, మనసా, వాచా మంచి చేయాలనే తపనతో ఉన్నట్లు తెలిపారు పీఆర్సీపై కొద్ది రోజులుగా ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారంనాడు కూడా ఉన్నతాధికారులతో ఈ అంశంపై చర్చించారు. గురువారం మరోసారి అధికారులతో మాట్లాడారు. పీఆర్సీపై ఇప్పటికే ప్రభుత్వం వివిధ స్థాయిల్లో సుదీర్ఘంగా చర్చలు జరిపింది. అనేక ఏళ్లుగా ఊసేలేని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలను పలుమార్లు నిర్వహించి ఉద్యోగ సంఘాల నాయకులు లేవనెత్తిన అంశాలపై ఉన్నతాధికారులు చర్చించారు. కరోనా కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్న నేపథ్యంలో ఉద్యోగులను సంతృప్తి పరిచేలా పీఆర్సీ ఎంత ఇవ్వాలనే దానిపై సమాలోచనలు జరిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సమీర్ శర్మ నేతృత్వంలోని కార్యదర్శుల కమిటీ ఇచ్చిన నివేదికపై ఉద్యోగ సంఘాలతో సీఎస్ చర్చించి, పూర్తిస్థాయిలో అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆర్థిక మంత్రి రాజేంద్రనాథ్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అధికారులతో సమావేశమై ఉద్యోగ సంఘాల నాయకులు చెప్పిన ప్రతి అంశంపైనా సుదీర్ఘంగా చర్చించారు. ఈ నేపథ్యంలోనే ఏపీ జేఏసీ, అమరావతి జేఏసీలు ఆందోళనలను విరమించుకున్నాయి.

## సివిల్స్ మెయిన్ ఎగ్జామ్ వాయిదాకు హైకోర్టు తిరస్కరణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ పరీక్షల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు గురువారం హైకోర్టుకు తెలిపింది. చివరి క్షణంలో వీటిని వాయిదా వేయరాదని కోరింది. 9,156 మంది అభ్యర్థుల్లో 9,085 మంది తమ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించింది. ఇప్పటికే చాలా విలువైన సమయం గడిచిపోయిందని తెలిపింది. ఈ పరీక్షలను వాయిదా వేయాలని 19 మంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. కోవిడ్-19కు గురయ్యే అవకాశం ఉందని, ఈ పరీక్షలను నిర్వహిస్తే అత్యంత విలువైన ఓ అటెంప్ట్‌ను కోల్పోవలసి వస్తుందని తెలిపారు. ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు నిర్ణయించిన గరిష్ఠ అవకాశాల్లో ఇది తమకు చివరి అవకాశమని కొందరు అభ్యర్థులు తెలిపారు. జస్టిస్ వీ కామేశ్వర రావు మాట్లాడుతూ, యూపీఎస్సీ నిర్ణయంలో జోక్యం చేసుకోబోనని చెప్పారు. ఈ పిటిషన్‌ను తోసిపుచ్చుతున్నట్లు తెలిపారు.

## మాన్సాస్‌పై పూర్తి స్థాయిలో దృష్టి సారించిన వైసీపీ నేత

విజయనగరం : మాన్సాస్‌పై పూర్తి స్థాయిలో వైసీపీ నేత దృష్టి సారించారు. మహారాజ కోటకు చెందిన మాన్సాస్ ఆస్తులపై నగరపాలక సంస్థ దౌర్జన్యం ప్రదర్శిస్తోంది. పెద్ద చెరువు పక్కన రామానాయుడు రోడ్డులోని కోట్ల విలువ చేసిన సర్వే నెంబరు 685 మాన్సాస్ స్థలం పార్కు చేయటానికి కార్పొరేషన్ చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి నిన్న ఆదేశాలు జారీ చేసింది. వేకువ జామునే అధికారులు అమలు చేశారు. మాన్సాస్ అధికారులు తమ స్థలంలోకి చొరబడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేసి, చట్టపరమైన చర్యలకు సమాయత్తమవుతున్నారు.

**పాస్ పోర్ట్ పోయినది**

నేను అయిత చిట్టీ బాబు తండ్రి అయిత సాయి బాబా నివాసం 4-168/బి ఎస్టీ కాలనీ తాకలపూడి గుంటూరు ఆంధ్రప్రదేశ్ తెలియచెయూనది ఏమనగా 2.01.2022 తేదీన నా ఇంటి నుండి జెరాక్స్ సెంటర్ వెల్లి న పాస్ పోర్ట్ జెరాక్స్ తిపిచుకొని మోటార్ బైక్ పాయ్ తిరిగి ఇంటికి వచ్చిచూసేసరికి నాఒరిజినల్ పాస్ పోర్ట్ కనపడటం లేదు. తిరిగి జెరాక్స్ సెంటర్ కి వెల్లి చూసేసరికి నా పాస్ పోర్ట్ కనపడలేదు....
దయచేసి నా పాస్ పోర్ట్ ఒరిజినల్ నెంబర్ :ఎఫ్6462044 ఎవరకి అయినా దొరికితే ఫోన్ చేయాగలరు.

**మొబైల్ నెంబర్ :చిట్టీ బాబు**
**9959256789**

# ఢీ.... అంటే.... ఢీ

## సచివాలయ సిబ్బంది కి పోటీగా.. రంగంలోకి టిడిపి వాలంటీర్లు

గుంటూరు బ్యూరో.ప్రజాపాలన :ఏపీలో వాలంటీర్ల వ్యవస్థ పైన విమర్శలు చేసిన టీడీపీ ఇప్పుడు కీలక నిర్ణయం తీసుకుంది. జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత గ్రామ - వార్డు వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారు. వారి ద్వారా ప్రజా సేవలు అందిస్తున్నారు. వైసీపీ కార్యకర్తలనే వాలంటీర్లుగా నియమించారంటూ పలుమార్లు టీడీపీ విమర్శించింది. ఎన్నికల సమయంలోనూ వాలంటీర్ వ్యవస్థను వాడుకోంటుందంటూ ఆరోపణలు చేసింది. అయితే, పార్టీ నియోజకవ వర్గ ఇన్ ఛార్జ్ లు.. ఎంపీలు..ఎమ్మెల్యేల సమావేశంలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేసారు.

ప్రతీ వంద మంది ఓటర్ల బాధ్యత ఒకరికి



రానున్న ఎన్నికలు ఆషామాషీ కాదని చెబుతూనే.. ఢీ అంటే ఢీ అనే విధంగా ఎదుర్కొనే వారనే అభ్యర్ధులుగా ఉండాలని స్పష్టం చేసారు. అలా ఉండలేని వారు పక్కకు వెళ్లిపోవాలని సూచించారు. ఇక, పార్టీ కార్యాచరణ వివరిస్తూనే... గ్రామ, వార్డు కమిటీల నియామకం ఈ నెల 15లోగా, మండల, క్లస్టర్, బూత్ కమిటీల నియామకం పూర్తి చేయాలన్నారు. బూత్‌లలో ప్రతి వంద మంది ఓటర్ల బాధ్యత ఒకరికి అప్పగించాలని, పార్టీ అధికారంలోకి వచ్చాక వారినే వాలంటీర్లుగా నియమిస్తామని చెప్పారు.

అధికారంలోకి వస్తే వారే వాలంటీర్లుగా

ఇలా ప్రతీ బూత్ పరిధిలోని వంద మందికి సంబంధించి పార్టీ పరంగా బాధ్యతలు కేటాయించిన వారే చూసుకుంటారు. వారితో టచ్ లో ఉండటంతో పాటుగా.. పార్టీకి అనుకూలంగా ఓటు వేయించటంలో వారు కీలక పాత్ర పోషించేలా పార్టీ కార్యాచరణ సిద్దం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం నియమించిన వాలంటీర్లు ప్రతీ ప్రభుత్వ పథకం అందించటంతో పాటుగా.. వారి సమస్యల పైనా స్పందిస్తున్నారు. దీంతో.. వాలంటీర్లకు తమకు కేటాయించిన వారి వరకు గుర్తింపు లభిస్తోంది. ఇప్పుడు టీడీపీ సైతం వాలంటీర్ల వ్యవస్థకు పోటీగా పార్టీ వాలంటీర్లను రంగంలోకి దించే ప్రణాళికలు సిద్దం చేస్తోంది.

రాజకీయంగా కీలకం కానున్న వాలంటీర్లు

దీని ద్వారా వార్డు సచివాలయ వాలంటీర్లు ఒక వైపు.. టీడీపీ పార్టీ వాలంటీర్లు ఫీల్డ్ లో ఉంటారు. అయితే, ఇప్పుడు పార్టీకి వాలంటీర్లుగా పని చేసిన వారిని టీడీపీ అధికారంలోకి వస్తే వారినే వాలంటీర్లుగా నియమిస్తామంటూ చెప్పాలని సూచించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు వార్డు సచివాలయాల ఉద్యోగులకు ప్రొబేషన్ పూర్తయింది. వారు అధికారికంగా ప్రభుత్వ ఉత్తర్వుల కోసం నిరీక్షిస్తున్నారు. ఈ సమయంలో టీడీపీ నుంచి వస్తున్న ఈ వ్యాఖ్యలు పెద్ద చర్చకు కారణమవుతున్నాయి. దీని పైన టీడీపీ ఏరకమైన క్లారిటీ ఇస్తుందో.. ప్రభుత్వం ఏ రకంగా రియాక్ట్ అవుతుందో వేచి చూడాల్సిందే.

## విద్యార్థులు సామాజిక చైతన్యాన్ని, శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

### ఎం.రామకృష్ణ పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు




రాజంపేట,ప్రజాపాలన ప్రతినిధి : ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు కడప జిల్లా మూడో మహాసభ స్థానిక గేమ్స్ జి ఎం సి కళ్యాణ మండపం లో గురువారం నాడు జరిగింది. మహా సభ ప్రారంభంలో బిగి పిడికిలి జెండాను జిల్లా అధ్యక్షులు ఎన్. నాగేశ్వర్ ఆవిష్కరించారు. అనంతరం ప్రారంభమైన సభలో అమరవీరులకు సంతాప సభ జిల్లా కార్యదర్శి నాగేంద్ర ప్రవేశపెట్టగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. ముఖ్య అతిథిగా హాజరైన పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు ఎం రామకృష్ణ మాట్లాడుతూ సామ్రాజ్యవాద విష సంస్కృతి లో విద్యార్థులు కొట్టుకుపోకుండా సామాజిక చైతన్యాన్ని శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సందేశం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 75 సంవత్సరాలుగా విద్యారంగాన్ని పార్టీలు ఏవైనా సంక్షోభంలోకి నెట్టారు అన్నారు. నేటి మన అక్షరాస్యత 75 శాతం కాగా అది ఉన్నత విద్యలో 35 శాతం మాత్రమే. ఎన్ఈపి - 2020 విద్యను వినయ సరుకుగా మార్చి వేస్తుందని అందుకనే అనేక మంది మేధావులు సామాజిక ఉద్యమకారులు ఈ నూతన విద్యా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి ఇస్తానన్నా ప్రత్యేక హోదా విభజన హామీలు 11 కేంద్రీయ విశ్వవిద్యాలయం స్థాపన పట్ల 200 21 -22 బడ్జెట్లు నిధులు కేటాయించకుండా 5కోట్ల ఆంధ్రులను మోసం చేస్తుందని విమర్శించారు. వివిధ రాష్ట్రాల లౌకిక ప్రజాస్వామిక హక్కులను హరించి వేస్తూ కేంద్రం తన చేతుల్లో విద్యారంగాన్ని పెట్టుకోవాలని ఏక కేంద్ర విద్యా శాఖను నిర్వహించడం ద్వారా రాష్ట్రాల హక్కులు హరించబడతాయని అన్నారు. రాష్ట్రంలో 3, 4, 5 తరగతులను హైస్కూల్లో షిఫ్ట్ చేసి ఉపాధ్యాయ పోస్టులను కుదించి డీఎస్సీ ప్రయత్నించకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని నూతన జాబ్ క్యాలెండర్ ప్రకటించటం ద్వారా పెద్ద ప్రయోజనం లేదని అన్నారు. పిడిఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న మాట్లాడుతూ ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఫీజు రెగ్యులేటరీ కమిషన్ జారీచేసిన 54, 53 జీవో లను ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు కోర్టు ద్వారా రద్దు చేయించి ఉన్నాయని ప్రభుత్వం ఫీజు నియంత్రణ పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు.అనంతరం పి డి ఎస్ యు కడప జిల్లా నూతన కార్యవర్గాన్ని 13 మందితో ఏకగ్రీవంగా మహాసభ ఆమోదించింది. జిల్లా అధ్యక్షుడిగా ఎన్ నాగేశ్వర్, కార్యదర్శిగా ఓ. నాగేంద్ర బాబు, ఉపాధ్యక్షులుగా వెంకటరమణ, మల్లి, సహాయ కార్యదర్శి చిన్న, వెంకటసురేష్ మరో 6 గురించి కార్యవర్గ సభ్యులు గా ఎన్నుకున్నారు. ఎయిడెడ్ విద్యా సంస్థలు పరిరక్షించాలని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, జాతీయ విద్యా విధానం 20 20 వ్యతిరేకించాలని. మహిళలు విద్యార్థినిల పట్ల జరుగుతున్న అన్ని రకాల హింసలను అరికట్టాలని తదితర తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

## ఈశ్వర్ కళాశాలలో 82 మంది బ్లడ్ డోనేషన్, 230 మంది బ్లడ్ గ్రుపింగ్ చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులు









నరసరావుపేట. ప్రజాపాలన :కేసానుపల్లి పంచాయతీ పరిధిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో నరసరావుపేట రోటరీ క్లబ్ సహకారంతో యన్. ఎన్.ఎస్.యూనిట్ తరఫున గురువారం రక్తదానం శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో 82 మంది బ్లడ్ డోనేషన్ ఇచ్చిరని, 230 మంది బ్లడ్ గ్రుపింగ్ చేసుకున్నరని తెలిపారు.ఈ కార్యక్రమంలో నరసరావుపేట రోటరీ క్లబ్ అధ్యక్షులు మెల్ల చెరువు సుమిత్ర కుమార్, పబ్లిక్ ఇమేజ్ డైరక్టర్ ఎస్.కె.జీలని,మాజీ రోటరీ క్లబ్ అధ్యక్షులు కొత్తూరి అంజనేయోలు, పాశం కృష్ణ రావు, పొట్టి శశి భూషణ్,కోశాధికారి మల్లికార్జున రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. మల్లికార్జున రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ ఖాసీం, యన్.ఎన్.ఎస్ పి.ఓ. హెచ్. గంగాధర్,విజయ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ శివశంకర్,అడ్మినిస్ట్రేషన్ కె. బ్రమ్మరావు,బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మమత, సౌందర్య, రాజు, హరీష్, వెంకట్రావు, మురళితదితరులు పాల్గొన్నారు. ముందుగా రక్తం అందక ప్రాణాలు కోల్పోయిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి వారికి నివాళులు అర్పించారు అనంతరం బ్లడ్ డోనేషన్ క్యాంప్ ఛైర్మన్ షేక్ కరీం మోహిద్దీన్ రక్త దానం చేసి శిబిరం ప్రారంభించారు ముఖ్యఅతిధిగా విచ్చేసిన రొటేరియన్ డాక్టర్ శాఖమూరి బాజి మాట్లాడుతూ రక్త దానం చేయుటకు యువత ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. విద్యార్థిని, విద్యార్థులు ఆడిగినటువంటి సందేహాలకు చక్కటి ఉదాహరణలతో కూడిన వివరణ ఇచ్చారు. రక్తం యుక్క విధులు మరియు డెంగ్యూ జ్వరాలు రాకుండా కావలసిన జాగ్రత్తలు వివరించారు.కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీం మోహిద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులలో సేవాభావం పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవితాన్ని ఉన్నత స్థాయి వెళ్లే వరకు ఎలాంటి విభేదాలు లేకుండా చాలా చక్కగా సాగిపోవలని.విద్యార్థులు ఎటువంటి దూరవాట్లకు లోను కావద్దని తెలిపారు. మాజీ మునిసిపల్ చైర్మన్,ఈశ్వర్ కళాశాల చైర్మన్ షేక్ మిరవలి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలాను ఉన్నత స్థాయిలో చూడాలని ఎంతో కష్టపడి చదివిస్తున్నారని వారి ఆశయాలను వమ్ము చేయవద్దు అన్నారు.

## జగన్‌రెడ్డి కుట్రలను బీసీలు ఐక్యమై చేధించాలి: టీడీపీ

అమరావతి: సీఎం జగన్‌రెడ్డి కుట్రలను బీసీలు ఐక్యమై చేధించాలని టీడీపీ బీసీ నేతలు పిలుపునిచ్చారు. టీడీపీ బీసీ నేతలతో పార్టీ కేంద్ర కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ భేటీలో బీసీలను ఏకం చేసేలా ప్రత్యేక కమిటీల ఏర్పాటుకు తీర్మానం చేశారు. బీసీల ఐక్యత, సంక్షేమం, అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ నేతలు స్పష్టం చేశారు. బీసీల్లో నాయకత్వ గుర్తింపు కోసం త్వరలోనే క్షేత్రస్థాయి అధ్యయనం చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో గెలుపు కోసం బీసీలకు జగన్‌రెడ్డి మోసపూరిత హామీలు ఇస్తున్నారని, జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బీసీల మధ్య చిచ్చు పెట్టారని నేతలు దుయ్యబట్టారు. స్థానిక సంస్థల్లో బీసీలకు టీడీపీ 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, జగన్‌రెడ్డి స్వలాభం కోసం 24 శాతానికి కుదించి.. 16,800 పదవులు దూరం చేశారని టీడీపీ బీసీ నేతలు విమర్శించారు. బీసీ జనగణనపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడాలని నిర్ణయం తీసుకున్నారు. జగన్‌రెడ్డి బీసీలకు చేస్తున్న ద్రోహంపై ఉద్యమించాలని టీడీపీ నిర్ణయం తీసుకుంది.

## అభివృద్ధికి 55 కోట్లు తీసుకుని రావడం బేష్: నయీమ్ ఉల్లా



కావలి జనవరి 6 ప్రజాపాలన ప్రతినిధి : నియోజకవర్గ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ప్రభుత్వం నుంచి 55 కోట్ల రూపాయల నిధులను తీసుకొని రావటం భేష్ అని రోడ్డు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ నయీమ్ ఉల్ల తెలిపారు. గురువారం పట్టణంలోని జగనన్న లేఅవుట్లను ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఏ ఎమ్మెల్యేకు దక్కని గౌరవరం ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చారని ఏ ఎమ్మెల్యే కు ఇవ్వని నిధులను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి ఇవ్వడం శుభపరిణామం అన్నారు.ట్రంక్ రోడ్డు విస్తరణ పనులకు 55 కోట్లు నిధులు తేవడం చిన్న విషయం కాదని ప్రసంశలు జల్లు కురిపించారు. అనంతరం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నివాసంలో చీఫ్ ఇంజనీర్ నయీమ్ ఉల్లాకి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు కేతిరెడ్డి శివ కుమార్ రెడ్డి, మహేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బైకుల దొంగ అరెస్ట్: డిఎస్పీ



కావలి, జనవరి 6 ప్రజాపాలన ప్రతినిధి : లాయర్ దగ్గర గుమస్తాగా చేస్తూ బెయిల్ పనుల నిమిత్తం కావలి వన్ టౌన్ స్టేషన్ కు వస్తూ బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న నెల్లూరుకు చెందిన రాజేంద్ర కుమార్ ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. లాయర్ నని చెప్పి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కి వచ్చి స్టేషన్లో బైక్ ల దొంగతనానికి పాల్పడ్డ గా ఈ కేసును చాలెంజ్ తీసుకుని సీఐ శ్రీనివాసరావు, ఎస్సై బాజీ బాబు పట్టుకున్నట్లు డిఎస్పీ తెలిపారు.

### పట్టణాన్ని ఆహ్లాదకరమైన రీతిలో తీర్చిదిద్దాలి: రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్. మల్లిబాబు

కొవ్వూరు : ప్రజాపాలన ప్రతినిధి : గురువారం ఉదయం స్థానిక వివేకానంద పార్కు ను మునిసిపల్ కమీషనర్ టి. రవికుమార్ తో కలిసి ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మల్లిబాబు మాట్లాడుతూ, కొవ్వూరు పట్టణానికి ప్రత్యేకమైన ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు కొవ్వూరు కి రావడానికి కారణం ఇక్కడ గోదావరి నది తో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రం కూడా కావడం అన్నారు. నగరాన్ని సుందరంగా ఉంచడం తో పాటు , పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాల్సి ఉ ందన్నారు. కొవ్వూరు లోని పార్కుల నిర్వహణ విషయంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని కోరారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న పార్కుల నిర్వహణ బాధ్యత ను సిబ్బందికి అప్పగించాల్సి ఉందన్నారు. ప్రతి వారం వాటి నిర్వహణ, పరిశుభ్రత ప్రాతిపదికన సమీక్ష నిర్వహించాలని మల్లిబాబు తెలిపారు. పార్కుల అభివృద్ధి కి స్థానికంగా ఉన్న పెట్రోలు బంకు నిర్వహికులు ఆసక్తి చూపుతున్నారని, వారితో కలిసి రూట్ మ్యాప్ రూపొందించాల్సి ఉందన్నారు. వివేకానంద పార్కు లో గుబురుగా ఉన్న మొక్కలను ట్రిమ్మింగ్ చెయ్యడం, వాకర్స్ నడిచేలా వాకర్స్ ట్రాక్ ఏర్పాటు పై దృష్టి సారించడం, మొక్కలు నాటడం, డస్ట్ బిన్స్ ఏర్పాటు వంటి పనులు చేపట్టాలని సూచించారు.

### ఎమ్మెల్యే గ్రంధికి పలువురి పరామర్శ



భీమవరం జనవరి 6 (ప్రజాపాలన ప్రతినిధి) : భీమవరం శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ తండ్రి గ్రంధి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఈ కారణంగా శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాసును పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు గురువారం పరామర్శించారు. ఉండి శాసనసభ్యులు మంతెన రామరాజు, పెడన శాసనసభ్యులు జోగి రమేష్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఉండి మాజీ శాసనసభ్యులు వేటుకూరి శివరామరాజు, జిల్లాకు చెందిన పలువురు వైసిపి నేతలు, భీమవరం వన్ టౌన్ సి ఐ ఆళ్ల కృష్ణ భగవాన్ తదితరులు శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాసును పరామర్శించి ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గ్రంధి వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి జివిఆర్ చేసిన సేవలను వారు కొనియాడారు.

# నియోజవర్గంలో 7.40 కోట్లతో రోడ్ల అభివృద్ధి: ఎమ్మెల్యే ముదునూరి



నరసాపురం, జనవరి 6 (ప్రజాపాలన ప్రతినిధి) :నియోజకవర్గంలో రూ. 7.40 కోట్ల రూపాయల నిధులతో పలు రహదారులను అభివృద్ధి చేయనున్నామని శాసనసభ్యులు ముదునూరి. ప్రసాదరాజు తెలిపారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో గురువారం ఆయన రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సలహాలు, సూచనలను జారీచేశారు. రోడ్ల పనులకు సంబందించిన టెండర్ పక్రియను పూర్తిచేసి పనులు త్వరితగతిన ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. నరసాపురం పట్టణ బిటి రోడ్డుకు సంబందించి 90లక్షలు రూపాయలు, లిఖితపూడి మల్లవరం పెధలంకకు బిటి %ం% సీసీ రోడ్డుకు రూ. 2 కోట్ల రూపాయలు, సీతారామపురం నుండి కొప్పర్రుకు బిటి %ం% సీసీ రోడ్డుకు రూ. 1కోటి 50 లక్షలు రూపాయలు, చిట్టవరం, కాజ, గొందికు బిటి %ం% సీసీ రోడ్డుకు రూ. 2 కోట్ల రూపాయలు, రామన్నపాలెం కాలువపై బ్రిడ్జి నిర్మాణం వయా పితానిమెరకకు రూ. 1 కోటి రూపాయల పనులకు టెండర్ల పక్రియను పూర్తిచేసి పనులను త్వరితగతిన ప్రారంభించాలని శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి డి.ఇ.ఇ. బివి రమణ , జెఈ నిక్కీ క్రజ్ పాల్గొన్నారు.

## జి.ఎం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ వారి దుప్పట్ల పంపిణీ కార్యక్రమం




విజయవాడ, ప్రజాపాలన: విజయవాడ పట్టణంలో జిఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లికార్జున రావు ఆదేశాల మేరకు యాచకులకు అభాగ్యులకు మానసిక వికలాంగులకు పేద ప్రజలకు పట్టణంలోని ప్రకాశం బ్యారేజి రైల్వే స్టేషన్, బస్టాండ్, దుర్గమ్మ గుడి, పాతపట్నం సొరంగం వద్ద సుమారు 200 మందికి దుప్పట్లను జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధులు అందించడం జరిగింది. చలిలో పేదలు పడుతున్న బాధలను జిఎంఆర్ చైర్మన్ చూసి చలించిపోయి ప్రత్యేక శ్రద్ధతో పైన పేర్కొన్న అనాధలకు సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు అయినటువంటి జి. శ్రీనివాస్ రెడ్డి నాగ కృష్ణ, భాను ప్రసాద్ మరియు సుదర్శన్ పాల్గొన్నారు.

## మాదిగ విద్యార్థులు గ్రామ కమిటీ ఎన్నిక



చందర్లపాడు రూరల్ జనవరి 6 ప్రజాపాలన ప్రతినిధి మండల పరిధిలో పోపూరు గ్రామంలో మాదిగ వి ద్యా ర్థుల గ్రామ కమిటీ సమావేశం సీఎస్ ఐ చర్చికాం పౌం డ్ లో జరిగినది ఈ సమావేశంలో ఎమ్మెస్పీ జా తీయ నాయకులు దొండపాటి సుధాకర్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ 27 యేండ్ల సుదీర్ఘ ఎస్సి వర్గీకర ణ ఉ ద్యమం చివరి దశకు చేరుకున్నది కనుక ఈ చి వరి దశ ఉద్యమంలో మాదిగ విద్యార్థుల పాత్ర పో షిం చ వలసిన సమయం ఆసన్నమైనదని మాదిగ వి ద్యా ర్థుల సత్తా సాటే విధంగా ఫిబ్రవరి 12న హైదరాబాద్ లో మహాజననేత మంద కృష్ణ మాదిగ నాయకత్వ ములో జరుపతలపెట్టిన మాదిగ విద్యార్థుల గర్జనను జయప్రదం చేయాలని కోరుతూ అన్ని గ్రామాలలో 10 నుండి పీజీ వరకు మాదిగ విద్యార్థుల కమిటీల ఎన్ని కలు జరుగుచున్నవి కనుక మన గ్రామంలో మంచి క మిటీని అందించాలన్నారు. అనంతరం నూతన కమి టీని ఎన్నుకున్నారు అధ్యక్షునిగా కోట అశోక్ మా ది గ,ఉపాధ్యక్షునిగా కోట కోటేశ్వరరావు మాదిగ,ప్ర ధాన కార్యదర్శిగా కోట పద్మారావు మాదిగ,కార్యదర్శిగా మాడుగుల నవీన్ మాదిగ, కోశాధికారిగా కోట సునీల్ మాదిగ,కార్యవర్గ సభ్యులుగా మాడుగుల కళ్యాణ్ మాదిగ,కోట చిన్న అశోక్ మాదిగలను ఏకగ్రీవంగా ఎ న్నుకున్నారు.

### మన సంస్కృతి సాంప్రదాయాలను గుర్తుచేస్తున్న హరిదాసులను సత్కరించిన జయ జయ సాయి ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజి



చిలకులూరిపేట:(ప్రజాపాలన) శ్రీ దత్త సాయి అన్నదాన సమాజము,జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యములో వేంచేసి యున్న శ్రీ దత్త సాయి సన్నిధి లో మన సంస్కృతి సాంప్రదాయాలను గుర్తుచేస్తున్న హరి దాసులను సత్కరించారు.ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజి మాట్లాడుతూ,భరత దేశ ఆచార వ్యవహారాలు చాలా గొప్పవి అని,అందులో తెలుగు రాష్ట్రాల్లో సూర్యుడు మకర రాశి లో ప్రవేశించగానే గానే సంక్రాంతి నెల వస్తుంది ఆ నెలలో ముఖ్యముగా హరిదాసులు వచ్చి హరి కీర్తనలు పాడుతూ వచ్చి పండగను గుర్తు చేస్తారు.వారిని గౌరవించడం మాన సాంప్రదయమని అన్నారు.గురువారం ట్రస్ట్ ఆధ్వర్యములో సత్కరించి,నిత్యా అవసర వస్తువులు అందజేశారు.పురాణాలలో నారద మహర్షి వారసులుగా హరి దాసులు ను గుర్తిస్తారు ఆని బాలాజి చెప్పారు.అనంతరం గంగా కృష్ణరావు ఆర్థిక సహారంతో 100 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిరవహించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు మానేపల్లి సుధాకర్ మహిళ భక్తులు పాల్గొన్నారు.

### మంత్రి కొడాలి నానిని కలిసిన మందపాటి



గుడివాడ : ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మర్యాద పూర్వకముగా మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు గారిని ఆయన ఇంటి వద్ద కలిశారు. ఈ సందర్భంగా గ్రంధాలయాల అభివృద్ధి కి తన వంతు కృషి చేస్తానని మంత్రి గారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కృష్ణాజిల్లా వైఎస్ఆర్సిపి కార్యదర్శి వెంపటి గుడివాడ మండల పార్టీ అధ్యక్షులు జాన్ విక్టర్ పారుపూడి మండల పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు దొండపాటి రాంబాబు కలపాల బాబురావు మామిల్ల రాజేష్. ఎంపీటీసీ మద్దాల అశోక్ .మార్కెటింగ్ యాడ్ వైస్ చైర్మన్ మంటాడ చలమయ్య .ఎస్సీ నాయకులు సాల్మన్ రాజు. చోరగుడి సంసోను .గుడివాడ ఎస్సీసెల్ అధ్యక్షులు మెండ చంద్రపాల్. గంధం బాబు. ఉపాధ్యాయులు డానియల్. కలపాల రవి .మొదలగువారు అభినందనలు తెలియజేసి రాజగిరి రావు గారిని సన్మానించారు.

## బిజెపి ఆధ్వర్యంలో ప్రశిక్షణ తరగతులు



నరసరావుపేట. ప్రజాపాలన :భారతీయ జనతా పార్టీ కి అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రశిక్షణ తరగతులు నర్సరావుపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు కర్ణ అమర సైదారావు అధ్యక్షతన కోటప్పకొండలోని శ్రీకృష్ణదేవరాయ కాపు సత్రం నందు గురువారం నిర్వహించారు. రెండోవ రోజు జరిగిన ప్రశిక్షణ సమావేశానికి ముఖ్య అతిధిగా మాజీ కేంద్ర మంత్రి వర్యులు ,భారతీయ జనతాపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీమతి పురందేశ్వరి ప్రారంభించారు.ప్రశిక్షణ శిబిరంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణ రాజు ,బిజెపి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ జూపూడి రంగరాజు ,బిజెపి నాయకులు కోటా సాయి కృష్ణ , చిగురుపాటి నరేష్ పాల్గొని ప్రధాన వక్తలుగా ప్రసంగించటం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఇన్చార్జి , ప్రశిక్షణ రాష్ట్ర కన్వీనర్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా పదాధికారులు, జిల్లా మోర్చా అధ్యక్షులు ,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు , రాష్ట్ర మోర్చ పదాధికారులు, కార్యవర్గ సభ్యులు ,జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల, పట్టణ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారులి

### "రక్తదానం చేయండి నిండు జీవితం కాపాడండి"

**బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ ముప్పలనేని శ్రీనివాసరావు**




బాపట్ల ప్రజాపాలన బ్యూరో : స్థానిక బాపట్ల మహిళ ఇంజనీరింగ్ కళాశాల "రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె" వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ శ్రీ ముప్పలనేని శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ప్రాణదాతలుగా నిలవాలని కళాశాల దశనుంచే సేవాభావం అలవర్చుకోవాలని అన్నారు ఈ కార్యక్రమములో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటి ప్రెసిడెంట్ శ్రీ ముప్పలనేని శ్రీనివాసరావు , సెక్రెటరి మానం నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ డి.రామ్మోహనరావు, వైస్ ప్రెసిడెంట్ జి.దిలీప్ కుమార్, జాయింట్ సెక్రటరి కే.హరి పద్మ ప్రసాద్, ట్రెజరర్ టి.రామకృష్ణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. జి.విజయ, యన్ సి సి అధికారిణి లెఫ్టినెంట్ ఓ. శ్రీదేవి , విభాగాధి పతిలు, అధ్యాపకులు, యన్ సి సి కాడెట్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు


PAY BACK TO SOCIETY
SNEHA CLUB

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్
కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం
కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల
కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao
DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046
7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111

Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

# ప్రజాపాలన

సంపాదకీయం

శుక్రవారం 07, జనవరి 2022


## విద్యా సంక్షోభానికే జీవో 85!

దేశవ్యాప్తంగా 'బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం' 2010 ఏప్రిల్ 1 నుంచి అమలు జరుగుతున్న విషయం తెలిసిందే. అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం, వివిధ సంఘాలతో చర్చించి చట్టం అమలుకు సంబంధించిన నిబంధనలను రూపొందించింది. ఆ నిబంధనలను 2011 మార్చి 3వ తేదీన జీవో నెంబరు 20 ద్వారా ప్రకటించింది. ఆ విధంగా రూపొందిన నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం, ఎవరితోనూ చర్చించకుండా, డిసెంబర్ 24, 2021న జీవో 85 ద్వారా తీవ్రంగా మార్చివేసింది. అన్నింటికంటే ప్రధానమైనది 3, 4, 5 తరగతుకు సంబంధించి సామీప్యత నిబంధనకు చేసిన మార్పు. ఈ మార్పు అసలు చట్టం మూల ప్రయోజనానికే భంగం కలిగిస్తుంది. విద్యాహక్కు చట్టంలో సెక్షన్ 38(4) ప్రకారం నిబంధనలలో మార్పు చేసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సదరు సవరణలను చట్టసభల ముందు పెట్టాలి. ఈ మార్పులను చట్టసభలు తిరస్కరించే అవకాశం కూడా ఉంది. మరి ఈ నిబంధనల సవరణ జీవోను ప్రభుత్వం చట్టసభల ముందు పెడుతుందని, చట్టసభలలో అవసరమైన చర్చ జరుగుతుందని ఆశిద్దాం. అయితే ఈ విషయమై ముందుగా ప్రజల మధ్య విస్తృతమైన చర్చ జరగాలి. నిజానికి, ప్రభుత్వం ఈ పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ ఆరు నెలల క్రితమే ప్రారంభించింది. మే 31, 2021న అప్పటి పాఠశాల కమిషనర్ సర్క్యులర్ 172 ఇచ్చారు. ప్రభుత్వరంగ ఉన్నత పాఠశాలలకు 2 కి.మీ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల నుండి 3, 4, 5 తరగతులను ఆయా ఉన్నత పాఠశాలలకు తరలించాలనేదే ఆ సర్క్యులర్ సారాంశం. ఆ ప్రతిపాదనకు వ్యతిరేకత రావడంతో తాత్కాలికంగా పరిధిని 250 మీటర్లకు కుదించారు. అయినప్పటికీ, సుమారు నాలుగువేల ప్రాథమిక పాఠశాలలు ప్రభావితం అయ్యాయి. ఆ బాలలు తమకు కేటాయించబడిన ఉన్నత పాఠశాలలకు వెళ్ళారు. ఆయా ఉన్నత పాఠశాలలలో అప్పటికే వసతుల కొరత, ఉపాధ్యాయుల కొరత ఉంది. కొత్తగా వచ్చిన చిన్నతరగతుల బాలలకు బోధన కోసం గదులు కాదు కదా వరండా కేటాయించే పరిస్థితి కూడా కొన్ని పాఠశాలల్లో లేదు. ఉద్యమాల ద్వారా, పత్రికల ద్వారా సమస్య బలంగా ముందుకు వచ్చిన తరువాత ఉన్నత పాఠశాలలలో వసతులు లేకపోతే 3, 4, 5 తరగతుల బాలలు తమ ప్రాథమిక పాఠశాల్లోనే ఉండాలనీ, అయితే ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు వారికి సబ్జెక్టులవారీగా బోధించాలని ఆదేశాలు ఇచ్చారు. అదనపు ఉపాధ్యాయులు ఏ ఉన్నత పాఠశాలలోనూ లేరు. అనేక ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. ప్రాథమిక పాఠశాలలకు పోయి ఎవరు చెప్పాలి? దీనిని పరిష్కరించడానికి ప్రాథమిక పాఠశాలల నుంచి మిగులు ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలకు పంపాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లోనూ మిగులు ఉపాధ్యాయులు లేరు. అయినప్పటికీ ప్రాథమిక పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు పంపారు. దీనివలన కొత్తగా వేలాది ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయి. అప్పటికీ ఉపాధ్యాయుల కొరత తీరలేదు. పరిష్కారంగా ఉన్నత పాఠశాలలలో సమాంతరంగా కొనసాగుతున్న మాతృభాషామాధ్యమాన్ని రద్దుచేశారు. దీనివల్ల ఆంగ్ల మాధ్యమం తమకు ఇబ్బందని, కోరి తెలుగు మాధ్యమాన్ని ఎంచుకున్న విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. అదలా ఉంచితే ఆంగ్ల మాధ్యమాన్ని రద్దుచేసినా ఉపాధ్యాయులు చాలలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ పునర్ వ్యవస్థీకరణ ఫలితంగా మొత్తం పాఠశాల వ్యవస్థ గందరగోళానికి గురైంది. ఇంకా, ఇప్పుడు 250 మీటర్ల పరిధికి కూడా పరిమితం కాకుండా 2కి.మీ వరకు 3, 4, 5 తరగతుల విలీనానికి మ్యాపింగ్ చేశారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు (జీవో 20) ప్రకారం బాలబాలికలకు 5వ తరగతి వరకు విద్య ఒక కిలోమీటరు సామీప్యంలోనే ఉండాలి. అందుకే జీవో 20 (మార్చి 2011)ని సవరిస్తూ జీవో 85ని తీసుకువచ్చారు. ఇందులో సామీప్య పరిమితిని ఒకేసారి ఒక కి.మీ నుంచి 3కి.మీ.కి పెంచివేశారు. 3 కి.మీ దూర పరిధిలో ప్రాథమిక లేదా ఉన్నత పాఠశాలలు ఇప్పటికే ఉన్నాయి. జీవో 85 అమలు జరిగితే రాష్ట్రంలో ఉన్న మొత్తం 32వేల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు కూడా ముక్కలవుతాయి. వాటిలో ఉన్న 3, 4, 5 తరగతుల బాలలు ప్రాథమికోన్నత లేదా ఉన్నత పాఠశాలలకు పంపబడతారు. ఆ భవనాలలో 1, 2 తరగతులు కొనసాగుతాయి. అక్కడికి ఆగలేదు. ఈ భవనాలకు ఒక కిలోమీటరు పరిధిలో ఉన్న అంగన్‌వాడీలను మారుస్తారు. అంటే అంగన్‌వాడీలు ఆవాసాలకు దూరం అవుతాయి. బాలింతలకు, గర్భిణీలకు దూరం అవుతాయి. ఈ ప్రక్రియ ఒక గొలుసుకట్ట సంక్షోభాలను సృష్టిస్తున్నది. ఇన్ని సంక్షోభాలు సృష్టిస్తున్న ఈ పునర్వ్యవస్థీకరణ ఎందుకు చేస్తున్నట్లు? విద్యా ప్రమాణాల పెంపుదలకే ఇదంతా చేస్తున్నామని అధికారులు, మంత్రులు చెబుతున్నారు. నిజమే ప్రభుత్వ పాఠశాలలు చాలా సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ విద్యను మెరుగుపరచడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి, తగినంతమంది ఉపాధ్యాయులను నియమించాలి. అయితే, మౌలిక సదుపాయాల విషయమై కొంతలో కొంత శ్రద్ధ చూపిస్తున్న ఈ ప్రభుత్వం రెండున్నరేళ్ళుగా ఉపాధ్యాయ ఖాళీలకు నియామకాలు మాత్రం జరపలేదు. ప్రభుత్వ కాలం సగం గడిచింది. కాని ఇంత వరకు ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే సుమారు 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయకుండా విద్యా ప్రమాణాలు ఎలా పెంచగలుగుతారు? 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలకు తరలించడం ద్వారా వారికి సబ్జెక్టులవారీ బోధన సాధ్యమవుతుందని, ఫలితంగా విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని ప్రభుత్వం అంటుంది. ఇది సబబైన కారణం కాదు. 5వ తరగతి వరకు విద్యార్థులకు తరగతుల వారీ సమన్వయ బోధన అవసరం. సబ్జెక్టుల వారీ బోధన మంచిది కాదు. ఉన్నత పాఠశాలలలో విశ్లేషణా పద్ధతి ఉంటుంది కాబట్టి సబ్జెక్టుల వారీ బోధన అక్కడ అవసరం. ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయుడు భాషలు, గణితం, పరిసరాల విజ్ఞానం మధ్య ఒక సమన్వయాన్ని సాధిస్తూ బోధన చేయాలి. ఆ పని తరగతి ఉపాధ్యాయుడు మాత్రమే చేయగలడు. అందుకే ప్రాథమిక స్థాయిలో విషయ ఉపాధ్యాయులు కాకుండా తరగతి ఉపాధ్యాయుల అవసరం అవుతారు. ప్రాథమిక స్థాయిలో తరగతి ఉపాధ్యాయుడు, సమన్వయ విద్య అన్న భావనలనే ఈ పునర్వ్యవస్థీకరణ ద్వారా ప్రభుత్వం రద్దుచేస్తున్నది. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఉన్నత పాఠశాలల్లో ప్రతి బోధనా విషయానికి ఒక ఉపాధ్యాయుడు ఆదర్శమైన విధానం. విద్యావ్యాపారీకరణ వలన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున కనీసం ఇద్దరు ఉపాధ్యాయుల నిబంధన పాటిస్తూ విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని బట్టి అదనపు ఉపాధ్యాయులను కేటాయిస్తారు. ప్రాథమిక పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాల కొరకు విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రస్తుతం ఉన్న 30:1 నుంచి 20:1గా మార్చాలని, అందులో భాగంగా ఆంగ్లోపాధ్యాయ, ప్రధానోపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలనే విజ్ఞప్తులను ఈ ప్రభుత్వం పెడచెవిని పెడుతున్నది.

## రైతాంగ విజయం కొత్త సంవత్సరానికి శుభసూచకం




2021 సంవత్సరంలో రైతాంగ పోరాటం ఒక కొత్త చరిత్రను నమోదు చేసింది. ఈ పోరాటానికి మోడీ ప్రభుత్వం తల వంచక తప్పలేదు. మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయక తప్పలేదు. రైతాంగం సమైక్యతతో, అకుంఠిత దీక్షతో జరిపిన పోరాటానికి ప్రభుత్వం లొంగిపోక తప్పలేదు. ఈ విజయంత్తోఐక్యంగా పోరు సల్పితే విజయం మీదేనన్న స్పష్టమైన సందేశాన్ని - కార్మిక వర్గానికి పంపింది. ఈ రైతాంగ ఉద్యమం ఫలితంగా కార్మికులు, కర్షకుల మధ్య ఐక్యత పెరగడం మనం చూశాం. వారి సంయుక్త కార్యాచరణలో అది ప్రస్ఫుటంగా వెల్లడైంది. హిందూత్వాకార్పొరేట్ వ్యవస్థకు వ్యతిరేకంగా భవిష్యత్తులో సాగే పోరాటాలు, నిరసనలకు ఇదొక పునాదిని వేస్తుంది. ప్రజలను పూర్తి స్థాయిలో కష్టనష్టాలకు గురిచేసిన 2021 సంవత్సరం ముగిసింది. గతేడాది మార్చి - మే మాసాల్లో డెల్టా వేరియంట్‌తో కోవిడ్ సెకండ్ వేవ్ బీభత్సాన్ని సృష్టించింది. ప్రజలను అతలాకుతలం చేసింది. జనవరిలోనే కరోనాపై విజయం సాధించామంటూ మోడీ, ఆయన ప్రభుత్వం ప్రకటించేసుకున్నారు. దాంతో ఆ తర్వాత తలెత్తిన ఈ దాడికి దేశం ఏవిధంగానూ సమాయత్తం కాలేదు. ఈ తప్పుడు ఆశావాదం ఫలితంగా, వేలాదిమంది మరణించారు. వారిలో చాలామంది మరణాలు కనీసం రికార్డులకు కూడా ఎక్కలేదు. ఆక్సిజన్ లేక ఊపిరి ఎగబీలుస్తూ, ఆయాసంతో బాధపడుతున్న రోగులను, గంగా నదిలో తేలియాడుతున్న శవాలను ప్రపంచ దేశాలన్నీ వీక్షించాయి. కానీ, దేశాన్ని ఇంత అధ్వాన్న స్థితికి దిగజార్చినందుకు ప్రధాని నుండి కనీసం చిన్నపాటి పశ్చాత్తాపం కానీ, ఆవేదన కానీ కనిపించలేదు. దానిపై ఒక్క మాట కూడా లేదు. వ్యాక్సిన్లకు సంబంధించి కూడా అంటే సకాలంలో తగిన సంఖ్యలో వ్యాక్సిన్లను సమకూర్చుకోవడం, దేశంలో వాటి ఉత్పత్తిని పెంచడం, వేగంగా, సమానంగా అందరికీ అందేలా పంపిణీ చేయడం వంటి అంశాల్లో అదే గందరగోళ పరిస్థితులు చూశాం. మొదటిసారి దేశ ప్రజలందరికీ ఉచితంగా వ్యాక్సిన్లు ఇవ్వడానికి బదులుగా ధరను నిర్ణయించారు. ఇక ఆ తర్వాత 18 ఏళ్ళు దాటిన పెద్దలందరికీ డిసెంబరు 31 లోగా రెండు డోసుల వ్యాక్సిన్లను అందచేస్తామని జూన్‌లో ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలియచేసింది. కానీ ఇప్పటికీ కేవలం 65 శాతం మందే పూర్తి స్థాయిలో వ్యాక్సిన్ తీసుకున్నారు. అంటే 35 శాతం కొరత వుందన్నమాట. ఇదే సమయంలో ఒమిక్రాన్ వేరియంట్ దేశాన్ని చుట్టుముడుతోంది. కరోనా సెకండ్ వేవ్‌ను ఎదుర్కొనేందుకు సరైన ప్రణాళిక రూపొందించడం, అన్ని సదుపాయాలు, చర్యలతో ఆరోగ్య వ్యవస్థను మెరుగుపరచడం, సమగ్ర వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను రూపొందించడంలో మోడీ ప్రభుత్వం విఫలమవడమే కాదు, మరోపక్క తన విచ్ఛిన్నకర, కార్పొరేట్ అనుకూల ఎజెండాతో ముందుకు సాగేందుకు ఈ సమయాన్నే ఉపయోగించుకుంది. రూ. 1.75 లక్షల కోట్ల మేరకు ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులను ఉపసంహరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు. ఆ తర్వాత, రూ. 6 లక్షల కోట్ల మేరకు ప్రభుత్వ రంగ ఆస్తులను విక్రయించే ప్రణాళికను చేపట్టారు. ఇదంతా ఓడరేవులు, విమానాశ్రయాలు, రైల్వే ట్రాకులు, భూమి ఇతర ఆస్తులను ప్రైవేటు పార్టీలకు లీజుకిచ్చే పేరుతో అయిన కాడికి అమ్మేయడం తప్ప మరొకటి కాదు. ఇక మరోవక్క కార్పొరేట్లకు ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇచ్చిన రుణాలు రద్దు చేయడం కొనసాగుతూనే వుంది. రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించనున్నారు. ఎల్ఐసి వాటాలను ఉపసంహరించుకున్నారు. అంబానీ, అదానీల పట్ల ప్రభుత్వం విచ్చలవిడిగా ప్రదర్శించిన పక్షపాతం కారణంగా కరోనా మహమ్మారి సమయంలో కూడా వారు అభ్యంతరకరమైన రీతిలో లాభాలు ఆర్జించారు. 2021లో అంబానీ నికర ఆస్తులు 927 కోట్ల డాలర్లుకు చేరుకుంది. అదానీ ఆస్తుల విలువ 787 కోట్ల డాలర్లకు పెరిగింది. ఇక ప్రజలకు సంబంధించి చూసినట్లైతే వారిపై ఇబ్బడి ముబ్బడిగా భారాలు మోపారు. కరోనా సెకండ్ వేవ్ ప్రజలను దారుణంగా దెబ్బ తీసింది. నిరుద్యోగం విశృంఖలంగా పెరిగిపోయింది. ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు మరింత పెరిగాయి. అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల కారణంగా భగ్గుమన్న ద్రవ్యోల్బణం ప్రభావంతో సామాన్యులు సంపాదించుకున్న కనీస ఆదాయాలు తుడిచిపెట్టుకుపోతున్నాయి. ఫలితంగా లక్షలాదిమంది దారిద్ర్యం లోకి నెట్టబడ్డారు. ఉపాధులు కోల్పోయి, నిరుద్యోగం పెరిగిపోతున్న కారణంగా ఆదాయాలు నష్టపోవడం కూడా పేదరికం పెరగడానికి మరో కారణమైంది. 2020-21లో కరోనా మహమ్మారి విలయతాండవం చేసిన కాలంలో దాదాపు 7 నుండి 8 కోట్ల మంది అదనంగా దారిద్ర్యం లోకి జారిపోయారు. మరోవైపు కేంద్రం, ఆర్ఎస్ఎస్ హిందూత్వ ఎజెండాను తీవ్రంగా అమలు చేస్తోంది. జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదాను ధ్వంసం చేసి, దానికి గల ప్రత్యేక హోదాను తొలగించిన తర్వాత రాష్ట్రం గుర్తింపును, దానికి గల భౌగోళిక, రాజకీయ పొందికను కూడా మార్చాలని చూస్తోంది. కాశ్మీర్ లోయ హోదాను, దాని రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించే లక్ష్యంతో అసెంబ్లీ సీట్ల పునర్విభజనను ఒక పద్ధతి ప్రకారం సాగిస్తోంది. అమిత్ షా ఆ వరుస క్రమాన్ని నిర్దేశించారు-ముందు పునర్విభజన, ఆ తర్వాతే ఎన్నికలు, ఆ తర్వాత రాష్ట్ర ప్రతిపత్తి. కత్తిరించిన రాష్ట్ర హోదాతో జమ్మూ కాశ్మీర్ సమగ్రతను నాశనం చేయవచ్చన్నది వారి ప్రణాళికగా వుంది. ఈలోగా, పౌర హక్కుల అణచివేతను వదిలిపెట్టలేదు. కాశ్మీర్‌లో భద్రతా బలగాలదే రాజ్యం అనుకుంటే ఈశాన్య ప్రాంతాలకూ అదే వర్తిస్తుంది. నాగాలాండ్‌లో 13మంది పౌరులను సైన్యం కాల్చివేయడం చూస్తుంటే జాతీయ భద్రత లోపించిందనే విషయాన్ని మనకు గుర్తు చేస్తోంది. హిందూత్వ పాలకులకు, అంతర్గత, బహిర్గత శత్రువులపై పోరాటం జరిపేందుకు పటిష్టమైన భద్రతతో కూడిన దేశాన్ని నిర్మించడం అవసరం. అంతర్గతంగా అంటే ముస్లింలే శత్రువులనేది స్పష్టమవుతోంది. మైనారిటీలను లక్ష్యంగా పెట్టుకుని బిజెపి నేతలు ప్రతీసారీ కవ్వించే రీతిలో విద్వేష ప్రసంగాలు చేయడం, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం నిలకడగా సాగుతోంది. మైనారిటీలకు వ్యతిరేకంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో వరుసగా పలు చట్టాలను ఆమోదించిన ఫలితమే ఇవన్నీ. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఇటీవలే కర్నాటకలో మత మార్పిడి చట్టాలను ఆమోదించారు. యు.పి, ఎం.పి ల్లో చేసిన చట్టాలు లవ్ జిహాద్‌ను లక్ష్యంగా చేసుకుని, మతాంతర వివాహాలను చేసుకున్న ముస్లిం యువతను అరెస్టు చేయగా, కర్నాటక చట్టం క్రైస్తవులపై దృష్టి పెట్టింది. ముస్లింలపై, వారి జీవనోపాధులపై నిరంతరాయంగా దాడులు జరుగుతూనే వున్నాయి. మరోవైపు ఈ ఏడాదిలో క్రైస్తవులపై, వారి ఆరాధనా స్థలాలపై కూడా ముమ్మరంగా దాడులు జరిగాయి. క్రిస్మస్ పండుగ రోజున కూడా ఇటువంటి దాడులు చోటు చేసుకున్నాయి. మదర్ థెరిస్సా మిషనరీస్ ఆఫ్ చారిటీకి విదేశీ విరాళాల లైసెన్స్‌ను కూడా తిరస్కరించారు. ఇలా మొత్తంగా ఈ సంవత్సరమంతా కూడా కోవిడ్ మహమ్మారిని సమర్ధవంతంగా నియంత్రించడంలో విఫలమవడం, నిరుద్యోగం, ధరల పెరుగుదల కారణంగా ప్రజలపై భారాలు పెరగడం, మైనారిటీలపై బహుముఖ దాడులు జరగడం కనిపిస్తోంది. ఈ దాడులన్నింటినీ ప్రజలు ప్రతిఘటిస్తూనే వున్నారు, తిరిగి పోరాడుతూనే వున్నారు. ఏప్రిల్‌లో జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళల్లో బిజెపి పరాజయాలను చవిచూసింది. అస్సాంలో మాత్రమే అధికారాన్ని నిలబెట్టుకోగలిగింది. అది కూడా చాలా స్వల్ప మెజారిటీతో. ఈ ఏడాదిలో చివరిగా జరిగిన ... కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని వనరులను పూర్తి స్థాయిలో వినియోగించినా, హిందూత్వ ప్రచారాన్ని సాగించినా బిజెపి కి పరాభవం తప్పలేదు. చండీగఢ్ కార్పొరేషన్‌ను బిజెపి కోల్పోగా, ఆప్ ఏకైక పెద్ద పార్టీగా ఆవిర్భవించింది. పోరాటాలు, ప్రజా నిరసనలు, ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలోనే బిజెపి కి ఈ ఎన్నికల పరాజయాలు సంభవించాయి. ఇక చారిత్రక రీతిలో రైతాంగం సాగించిన పోరాటం దేశంలో ప్రజా పోరాటాలు, ఉద్యమాల చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించింది. 2021 సంవత్సరంలో రైతాంగ పోరాటం ఒక కొత్త చరిత్రను నమోదు చేసింది. దేశ రాజధాని ఢిల్లీ చుట్టుపక్కల ఏడాది పాటు నిలకడగా సాగించిన నిరసనల్లో వేలాదిమంది రైతులు పాల్గొన్నారు. ఈ పోరాటానికి మోడీ ప్రభుత్వం తల వంచక తప్పలేదు. మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయక తప్పలేదు. రైతాంగం సమైక్యతతో, అకుంఠిత దీక్షతో జరిపిన పోరాటానికి ప్రభుత్వం లొంగిపోక తప్పలేదు. ఈ విజయంతో-ఐక్యంగా పోరు సల్పితే విజయం మీదేనన్న స్పష్టమైన సందేశం - కార్మిక వర్గానికి అందింది. ఈ రైతాంగ ఉద్యమం ఫలితంగా కార్మికులు, కర్షకుల మధ్య ఐక్యత పెరగడం మనం చూశాం. వారి సంయుక్త కార్యాచరణలో అది ప్రస్ఫుటంగా వెల్లడైంది. హిందూత్వాకార్పొరేట్ వ్యవస్థకు వ్యతిరేకంగా భవిష్యత్తులో సాగే పోరాటాలు, నిరసనలకు ఇదొక పునాదిని వేస్తుంది. కొత్త సంవత్సరం ఈ శుభ సూచనతోనే ప్రారంభం కానుంది.

## సినిమా సూపిస్త ...



ఒక మిత్రుణ్ణి కలవడానికి పోతాము. కొద్దిగా నస కేసు అని ముందే తెలుసు. అయినా ఫ్రెండ్ కదా అన్న ఒకే ఒక్క సెంటిమెంటుతో కలుస్తాం. అలా అతణ్ణి కలిసొచ్చాక మిగతా వాళ్ళు అడుగుతారు ఏమి చెప్పాడని. అబ్బా సినిమా చూపించాడురా బాబూ అని మొదలు పెడతాం. ఇంతకు ముందు చుక్కలు చూపించాడురా అనేవాళ్ళు. సినిమా చూపించాడురా అని తరువాత మార్చారు. ఇలా డైలాగులు మారుతుండడం, కొత్తవి రావడం. అవీ సినిమాల నుండి తీసుకున్నవే ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. అలా సినిమా మన జీవితాల నుండి విడదీయలేని మీడియాగా మారిపోయింది. సినిమా అంటే చిత్రం. అది బహు విచిత్రం. చట్టానికి కళ్ళు లేవు అన్న పేరుతో ఒకరు తీస్తే చట్టానికి వేయి కళ్ళు అని ఇంకొకరు తీస్తారు. ఒకాయన గుళ్ళూ గోపురాలపై సినిమాలు తీస్తే ఇంకొకాయన గూండాలు మాఫియాలపై తీస్తాడు. ఏ కొద్ది మందో ప్రజల కష్టాలను చూపించే సినిమాలు తీస్తారు. ప్రజలు నేర్చుకోవలసిన ఆదర్శాలను ఇంకా తక్కువమంది తీస్తారు. ఇక సైన్సును ఆసరాగా చేసుకొని అదే సైన్సుకు వ్యతిరేకంగా మూఢ నమ్మకాలను సినిమాలుగా తీసే వాళ్ళూ ఉన్నారు. ఇలా సినిమా ఎన్నో అవతారాల్లో కనిపిస్తుంది. ఇక అన్నింటిలోనూ కొత్త తరం వచ్చినట్టే సినిమాలోనూ వచ్చి ఇప్పుడు షార్టు ఫిల్ములు తీస్తున్నారు. సినిమా అంటే రెండున్నర లేదా మూడు గంటలు ఉండాలన్న రూల్ లేదిప్పుడు. కథను బట్టి ఉంటుంది. సినిమా చుట్టూ ఎంత సినిమా నడుస్తుందో ఈ మధ్య తెలుస్తోంది. రోజుకో కామెంటు. రోజుకో వార్త. రాజకీయాలను సినిమాగా తీసే రోజులు పోయి సినిమానే రాజకీయమైందని ఇప్పుడు చర్చ నడుస్తోంది. సినిమా నటులు రాజకీయాల్లోకి రావడం అటు కేంద్రంలో కానీ ఇటు రాష్ట్రాల్లో కానీ కొత్త కాదు. వచ్చారు. నిరూపించారు సినిమా పవరేంటో. ఆ తరువాత ఆటుపోట్లు తిన్నారు. అది వేరే సంగతి. సినిమా టికెట్ల ధరలపై ఇప్పుడు చర్చ నడుస్తోంది. అది కూడా సినిమా వల్లే రక్తి కడుతోంది. ప్రజల నిత్యావసరాల రేట్లు ముందు తగ్గించండి. తరువాత సినిమా రేట్లు తగ్గించొచ్చు అని ఒకరు. అసలు సినిమా కూడా నిత్యావసరమే అని ఒకరు. ఇలా వాదాలు ప్రతివాదాలు వినిపిస్తున్నాయి. ఏది మాట్లాడినా సంచలనంగా మాట్లాడే వాళ్లకు మహా మహా చాన్సు దొరికిందిప్పుడు. అసలు సినిమా నుండి వచ్చినవారే తరువాత అదే సినిమా రంగానికి అన్యాయం చేశారని, ఎన్నో కొత్త రూల్సు పెట్టి దాన్ని దెబ్బ తీశారని సినీ జనం చెబుతుంటారు. అదేం కాదు. వాళ్లకు ఇవ్వవలసిన రాయితీలు ఇస్తున్నాం. ఇంకెన్ని ఇవ్వాలి అని వారికి సమాధానాలు కూడా వచ్చేశాయి. కాబట్టి బయటివాళ్ళ నుండి కానీ, సినిమా నుండే వచ్చిన వాళ్ళ నుండి కానీ కొన్ని పరిస్థితులను సినిమా ఎదుర్కోవడం మామూలే. కరోనా కోరల్లో పడ్డ రంగాల్లో సహజంగానే సినిమా ఉంది. అసలు కరోనాకు ముందు, కరోనా తరువాత అని చెప్పుకునే రోజులు వచ్చాయి. ఇంకా కరోనా మూడో దశ ఒమిక్రాన్ రూపంలో ఉండనే ఉంది. అది పోతూ పోతూ తన ప్రతాపాన్ని ఎలా చూపిస్తుందో అన్న భయం కూడా సినీ జనుల్లో ఉంది. జీవులు బతికి బట్ట కట్టాలంటే మార్పులు చేసుకోక తప్పదని డార్విన్ మహాశయుడు ఎప్పుడో చెప్పాడు. అందుకే సినిమా తాను వెలిగిపోయిన థియేటర్లను వదిలేసి డైరెక్టుగా చూసే వాళ్ళ ఇళ్లకే టీవీల ద్వారా వచ్చేసింది. ఆహార పదార్థాలను చేరవేసే సంస్థల్లాగే డైరెక్టు సినిమాలను కూడా ప్రజల్లోకి తీసుకుపోయే కార్పొరేట్లు వచ్చేశారు. డబ్బు డబ్బును సంపాదిస్తుంది అన్న సూత్రం ప్రకారం అలా సంపాదించే రంగాల్లో సినిమా కూడా ఎప్పటి నుండో ఉంది, ఇకపై ఉంటుంది కూడా. రూపాలు మారొచ్చు అంతే తేడా, మిగతాదంతా సేమ్ తో సేమ్. ఒక సినిమాలో ఓ కమెడియన్ చెబుతుంటాడు. ఇంట్లో తండ్రికి క్యాన్సర్, తల్లికి టీబీ, తమ్ముడికి బ్రెయిన్ ట్యూమర్... ఇలా ఇంకొకరికి వేరే జబ్బు. ఇదేంటి ఒకే ఇంట్లో ఇన్ని రోగాలంటే వాటినే సినిమా కష్టాలంటారని చెబుతాడు. అలా సినిమాలో చూపించే కష్టాలని జోకుగా చెబుతాడు. అలాంటి సినిమాకి ఎన్ని కష్టాలచ్చాయో ఇప్పుడు. అన్ని కష్టాలచ్చినా ఎంతో కష్టపడి సాగుతోంది సినిమా. కష్టాలు సినిమాలకు గాక ఇంకెవరికి వస్తాయి అని కొత్తగా అనుకోవాలి.

# జగనన్న ఇండ్ల నిర్మాణం వేగవంతం చెయ్యాలి

## ◆సబ్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

నరసాపురం జనవరి 6 (ప్రజాపాలన ప్రతినిధి) : డివిజన్ పరిధిలోని ప్రతి మండలంలో భూమి పూడిక పనులు పూర్తయిన లేఅవుట్లలో గృహ నిర్మాణాలు విధిగా ప్రారంభించాలని గతంలో ప్రారంభించిన ఇండ్ల నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జగన్నన్న ఇండ్ల నిర్మాణాలపై గృహ నిర్మాణశాఖ పి.డి. టి.వేణుగోపాల్, డ్వామా పి.డి. డి. రాంబాబుతో ఆయన డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ లేఔట్ల వారీగా పూర్తిసమాచారం మండల ప్రత్యేక అధికారులవద్ద ఉండాలని, మండల ప్రత్యేక అధికారులు అన్ని లేఔట్లను సందర్శించాలని ఆయన సూచించారు. వారంలో రెండు లేదా మూడుసార్లు గృహనిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. డివిజన్లో గృహనిర్మాణాల లేఔట్లకు సంబంధించి అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి నిధుల ఇబ్బంది లేదని అప్రోచ్ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఇంకా పూడిక పూర్తవ్వని లేఅవుట్ల పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఓటీఎస్ లబ్ధిదారుల డేటాఎంట్రీ పూర్తిచేయాలని లబ్ధిదారుల డేటా రుణాలు తీసుకున్న వారు, రుణాలు తీసుకోని వారి డేటా ఆన్లైన్లో ఎంట్రీ పూర్తి చేయాలని ఆయన సూచించారు. డేటా ఎంట్రీ పూర్తయిన వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని డాక్యుమెంటేషన్ స్కానింగ్ పూర్తిచేసి అప్లోడ్ చేయాలని ఆయన సూచించారు. డివిజన్లో మండలాల వారిగా జగనన్న కాలనీలపై ప్రగతిని అడిగి తెలుసుకుని లోటుగా వున్నచోట ఆయా అధికార్లపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులు వేగవంతం చేయాలని రోజువారీగా ప్రగతిని డివిజన్, జిల్లాకు పంపాలని ఆదేశించారు. సిమ్మెంట్, ఐరన్, ఇసుక అందుబాటులో ఉన్నాయని ఇండ్ల నిర్మాణ చెల్లింపులు సకాలంలో జరుగుతాయని లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణాకి పునాదులు వేసుకుని ఇండ్లనిర్మాణం మొదలు



పెట్టుకోవాలని ఆయన అన్నారు. కాలనీలలో పూర్తిస్థాయిలో మౌళిక సదుపాయాలు కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటామని అధికారులు దగ్గర ఉండి పనులు వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ పి.డి. వేణుగోపాల్, డ్వామా పి.డి. రాంబాబు, గృహనిర్మాణ శాఖ ఈఈ బి.పిచ్చయ్య, కార్యాలయం ఏ.వో యస్.వి.సుబ్రహ్మణ్యం, మండల ప్రత్యేక అధికారులు, డివిజన్ తహసీల్దార్లు, గృహ నిర్మాణశాఖ అధికారులు, యం.పిడివోలు, పురపాలక సంఘం కమీషనర్లు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మిస్తున్న ట్రెజరిఆఫీస్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే



చీరాల (ఒంగోలు) : చీరాల మండల పరిషత్ ఆఫీస్‌లో మండలఅధికారులు,పంచాయితీ సెక్రటరీలతో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సమావేశం నిర్వహించారు.నూతనంగా నిర్మిస్తున్న ట్రెజరిఆఫీస్, గృహనిర్మాణశాఖ ఇంజనీర్ కార్యాలయం, మీ సేవ కేంద్రం, నూతన మండల సమావేశ మందిరానికి స్థలాన్ని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పరిశీలించారు.పరిశీలన చేసి శాసనసభ్యులు కరణం బలరామకృష్ణ మూర్తి, మాజీమంత్రి పాలేటి రామారావు,అర్బన్ ఇన్ఫ్రస్ట్రక్చర్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు,ఎంపీడీఓసాంబశివరావు, చీరాల ఎస్‌టిఓ భాగ్యలక్ష్మి, హౌసింగ్ డి.ఇ.మాధవరావు, ఆర్.ఐ.శ్రీకాంత్, పంచాయితీ సెక్రటరీలు, సర్వేయర్లు,ధనుంజయ,నాదెండ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలములో రోడ్డుపై నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే



చీరాల (ఒంగోలు) : చీరాల నుండి ఒంగోలు వెళ్లే ప్రధానరహదారిలో, దేవాంగపురి గ్రామంలో, వర్షాకాలములో రోడ్డుపై, నీరు నిలిచే ప్రాంతా లను పరిశీలించి, మార్కెట్ ప్రాంతాన్ని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పరిశీలించారు.పంచాయితీకార్యాలయంలో సచివాలయ సిబ్బంది, అధికారులతో, సమీక్షాసమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తితో పాటు, మాజీమంత్రి పాలేటి రామారావు, అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఎంపీడీఓ.సాంబశివరావు, పంచాయతీరాజ్ డి.ఇ.శేషయ్య, ఏఇ. రమేష్, పంచాయితీసెక్రటరీ అంజయ్య, మాజీఎంపీటీసీ సుధా,ధనుంజయ, వెంకటేశ్వర్లు,సుబ్బారావు,తదితరులు పాల్గొన్నారు.

## సాధు విజయ్ కుమార్, కిరణ్‌తో నాకు ప్రాణహాని ఉంది

### రక్షణ కల్పించండి వృద్ధురాలు నాగేంద్రమ్మ వేడుకోలు



నరసరావుపేట.ప్రజాపాలన :సాధు విజయకుమార్, సాధు కిరణ్ ,దేవి ల వలన ప్రాణహాని ఉందంటూ గురువారం నరసరావుపేటకు చెందిన ఊటుకూరి నాగేంద్రం కన్నీటితో వేడుకుంది. స్థానిక పల్నాడు రోడ్ లో పాల కేంద్రం ఎదురు గత 35 సంవత్సరాలుగా పిల్లలతో జీవిస్తున్నామని అక్కడ కూరగాయలు కొట్టు పెట్టుకొని ఆడపిల్లలతో జీవనం సాగిస్తున్నామని తెలిపారు. గత కొద్ది రోజులుగా సాధు విజయకుమార్, కిరణ్ అను వారు స్థలాన్ని ఖాళీ చేయాలి అంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. అర్ధరాత్రి సమయంలో తమకు జీవనోపాధి అయిన కూరగాయల షాప్ ను కొంతమంది వ్యక్తులను పంపించి విజయ్ కుమార్ ,కిరణ్ లు జేసీబీ తో కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు, ఆర్థికంగా నష్టం చేశారంటూ తెలిపారు. ఈ విషయమై వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని పోలీసులు తమకు న్యాయం చేయాలని తమ ప్రాణ రక్షణ కల్పించాలని ఊటుకూరు నాగేంద్రం తెలిపింది.

## క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమిష్టిగా కృషి: బాపట్ల పార్లమెంటుజిల్లాఅధ్యక్షులు, పర్చూరుఎమ్మెల్యే ఏలూరి



చీరాల (ఒంగోలు) : తెలుగుదేశం పార్టీ అధినేత నారా.చంద్రబాబునాయుడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన, అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలఇన్చార్జిల సమావేశానికి, బాపట్ల పార్లమెంటుజిల్లాఅధ్యక్షులు, పర్చూరుఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు,ఎమ్మెల్యే అనగాని.సత్య ప్రసాద్, అద్దంకిఎమ్మెల్యే గొట్టిపాటి.రవికుమార్, మాజీఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి.సాంబశివరావు మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతంచేసేందుకు, తీసుకోవాల్సిన చర్యలపై, అధినేత పలు సూచన లు చేశారన్నారు. క్రమంగా తెలుగుదేశం పార్టీని భ్రష్టు పట్టించేందుకు, అక్రమంగా కేసులు బనాయించి, పార్టీ నాయకులు, కార్యకర్తలను, ఇబ్బంది పెడుతూ, తెలుగుదేశం పార్టీని భూస్థాపితం చేసేందుకు, ముఖ్యమంత్రి జగన్ పలు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. తెలుగు దేశం పార్టీ అధినేత సూచనల మేరకు, పార్టీని క్షేత్రస్థాయిలో సైతం, మరింత బలోపేతం చేసేందుకు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సమిష్టిగా కృషి చేయాలని, ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## చీరాల సెయింట్ ఆన్స్‌లో "ఎంటర్‌ప్రెన్యువర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ "




చీరాల (ఒంగోలు) : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, చీరాలలో ఎంటర్‌ప్రెన్యువర్ షిప్ క్లబ్ వారి ఆధ్వర్యములో,చివరిసం. బి.టెక్, యం.బి.ఎ విద్యార్థులకు, సెమినార్ నిర్వహించారని కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి.రమణమూర్తి తెలిపారు.అటానమస్ కళాశాలగా, టైమ్స్ ఆఫ్ ఇండియా, సి.ఇ.జి.ఆర్ సంస్థల సర్వే ద్వారా, భారత దేశములోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో ఒకటిగా సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, గుర్తింపు పొందినట్లు,కళాశాల ఎంటర్‌ప్రెన్యువర్ షిప్ క్లబ్ వారి ఆధ్వర్యములో,ఎంటర్‌ప్రెన్యువర్ షిప్ అనే అంశంపై సెమినార్ నిర్వహించినట్లు, కళాశాల ప్రధాన అధ్యాపకులు మొయిద వేణుగోపాల రావు తెలిపారు.ఈ సెమినార్‌కు నాబార్డ్ బ్యాంకు, ఒంగోలు అసిస్టెంట్ జనరల్‌మేనేజర్ (డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్)వి.వెంకటరమణ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కావలసినలక్షణాలు, సమాజంలో ఔత్సాహికపారిశ్రామికవేత్తల ప్రాముఖ్యతను వివ రించారు.సరియైన లక్ష్యాలను నిర్దేశించుకొని, తగిన విషయసేకరణ చేసి, సమయపాలనను పాటించి, సరియైనబాటలో పరిశ్రమను లేదా వ్యాపారాన్ని అభివృద్ధి చేసిన యెడల, ఉత్తమ పారిశ్రామికవేత్తలుగా గుర్తింపు పొందవచ్చన్నారు.పరిశ్రమల నిర్వహణలో టీమ్‌వర్క్ యొక్క ప్రాధాన్యతను గూర్చి తెలిపారు.వివిధ పరిశ్రమలకు బ్యాంకులుఇచ్చే ఋణసౌకర్యాలు, రాయితీలగురించి వివరంగా తెలియజేశారు. డా.యస్. చాంద్‌బాషా కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, కెనరాబ్యాంకు (డిస్ట్రిక్ లీడ్ బ్యాంక్)యుగంధర్ రెడ్డి, యం.బి.ఎ.విభాగాధిపతి డా.ఆర్.ఇమ్మాని యేల్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు,చివరిసం.బి.టెక్, యం.బి.ఎ.విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


## రోడ్లు, మంచినీటి సౌకర్యాలు కల్పించటానికి తగిన చర్యలు



చీరాల (ఒంగోలు) : చీరాల మండలం కొత్తపాలెం పంచాయితి విరాట్ కాలనీలో,నూతనంగా మంజూరు చేసిన విద్యుత్ లైన్లు ప్రారంభించి, కాలనీలో వసతుల విషయంపై,అధికారులతో సమీక్షించారు.రోడ్లు, మంచినీటి సౌకర్యాలు కల్పించటానికి తగిన చర్యలు చేపట్టి, త్వరితగతిన పూర్తి చేయాలని, శాసనసభ్యులు కరణం బలరామకృష్ణ మూర్తి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సాంబశివరావు, ఎలక్ట్రికల్ ఎ డి ఎ శ్రీనివాసరావు, పంచాయితీ రాజ్ డి ఇ శేషయ్య,ఆర్ డబ్లు ఎస్.డి ఇ శివప్రసాద్, చీరాలనగర్ మాజీ సర్పంచ్ రాజు శ్రీనివాసరెడ్డి, ఆసాది అంకాలరెడ్డి, క్రిష్ణ, బాలకోటిరెడ్డి, బక్కా శివప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోలేరమ్మ జాతర లో మేము సైతం

### మురళీ రెడ్డి కి అండగా హజరత్ రెడ్డి



కావలి, జనవరి 6 ప్రజాపాలన ప్రతినిధి :పద్నాలుగేళ్ల తర్వాత ప్రతిష్టాత్మకంగా జరగనున్న కావలి పోలేరమ్మ జాతర కు తాము సైతం అండగా నిలుస్తామని పాత ఊరి కి చెందిన పలువురు యువత పేర్కొన్నారు.వేలమూరి హజరత్ రెడ్డి,మక్కెన మధురెడ్డి మిత్రమండలి తమ సభ్యులతో వచ్చి ఉత్సవ నిర్వాహకులు లలో ఒకరైన ఈతముక్కల బాలమురళీ రెడ్డి ని కలిసి ఉత్సవ నిర్వహణలో తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లలో పాల్గొనడం ఇప్పటికె ఆలస్యం అయిందని అమ్మవారి జాతర ను ప్రతిష్టాత్మకంగా జరగడం లో పాల్గొనే అవకాశం తమకు లభించడం అదృష్టం అని హజరత్ రెడ్డి,మధురెడ్డి,వాకా క్రిష్టా రెడ్డి అన్నారు. యమ్ యల్ ఎ ప్రతాప్ కుమార్ రెడ్డి, ఇతర గ్రామ పెద్దల సహకారంతో పోలేరమ్మ అరుగు పరిసరాలను అద్భుతంగా మలచడం లో కీలకం గా ఉన్న బాలమురళీ రెడ్డి ని శాలువాతో సత్కరించారు.

## జివిఆర్ సేవలు మరువలేనివి



భీమవరం, జనవరి 6 (ప్రజాపాలన ప్రతినిధి) :స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ తిరుమాని ఏడుకొండలు ఆధ్వర్యంలో గురువారం ప్రముఖ వై.ఎస్.ఆర్.సి.పి.నాయకులు, వ్యాపారవేత్త గ్రంధి వెంకటేశ్వరరావు సంతాపసభ జరిగింది. ముందుగా జివిఆర్ చిత్రపటానికి ఏ.ఎం.సి. చైర్మన్ తిరుమాని ఏడుకొండలు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంధి వెంకటేశ్వరరావు ఒక రైతుగా ప్రస్థానాన్ని ప్రారంభించి, సాగర్ గ్రంధి ప్రాన్ ఎక్సపోర్టరుగా, జివిఆర్ ఎక్స్ పోర్ట్, భీమవరం కో-అపరేటివ్ బ్యాంక్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా వివిధ పదవులను అలంకరించి భీమవరం నియోజకవర్గానికి ఆయన విశేషమైన సేవలందించారని అన్నారు. ఆయన లేనిలోటు తీర్చలేనిదని ఆయన పవిత్రాత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబసభ్యులకు ఓదార్పు కలుగజేయలని భగవంతుణ్ణి కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి. పేరిచర్ల విజయ నరిసింహరాజు, రాష్ట్ర అవుట్సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కోప్పర్తి సత్యనారాయణ, కొట్టు కుటుంబరావు, నాగిడిపాలెం సర్పంచ్ నాగిడి నారాయణస్వామి, దెయ్యాలతిప్ప సర్పంచ్ తిరుమాని శ్రీను, ఏ.ఎం.సి. వైస్ చైర్మన్ పాలా లక్ష్మీకుమారి, డైరెక్టర్లు కామన రాంబాబు, అల్లూరి నాగవల్లి, షేక్ అన్సారీ, చెన్ను శాంతి, సుంకర లీలా విజయలక్ష్మి, మద్దాల వెంకట సత్యనరసింహారావు, రావి భారతి, టంగుటూరి ఆది వెంకటనారాయణ, కట్రెడ్డి వెంకటేశ్వరరావు, పెంటపాటి సత్యనారాయణ, కో.అపరేటివ్ సొసైటీ బాంక్ అధ్యక్షులు రాంబాబు, పార్టీ నేతలు సుంకర బాబురావు, కోమటి రాంబాబు, తోట నాగు, చెన్ను చంటి, భాజింకి రామారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## డివిజన్‌లో నూతనంగా 01 కేసులు నమోదు: ఆర్‌డివో శ్రీనుకుమార్



గుడివాడ : గుడివాడ డివిజన్‌లో 01 కేసులు నమోదు అయినట్లు ఆర్‌డివో జి.శ్రీనుకుమార్ తెలిపారు. గురువారం స్థానిక డివిజనల్ రెవెన్యూ కార్యాలయంలో అయన విలేకర్లతో మాట్లాడుతూ గుడివాడ డివిజన్‌లో కరోనా కేసులు 01 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. గుడివాడటౌన్‌లో 01 కేసులు నమోదు అయినట్లు తెలిపారు.

## యాదవ సేవ సంఘం అధ్వర్యంలో అన్నదానం



గుడివాడ : శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వృద్ధుల మధ్య పల్లపోతు అభిష్తిక పుట్టినరోజు జరుపుకోవడం అభినందనీయమాని వైసీపీ జిల్లా నాయకులు మండలి హనుమంతరావు అన్నారు. గురువారం స్థానిక పాటిమిద గల కరుణాపీఠంలో అభిస్తిక పుట్టినరోజు వేడుకలను వృద్ధుల మధ్య జరుపుకుని వారికి అన్నదానం, పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా మండలి హనుమంతరావు మాట్లాడుతూ యాదవ సేవా సంఘం ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న హరికుమార్‌ను అదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ గాదే మోహన్‌బాబు, రాష్ట్ర యాదవ సంఘం మహిళా కార్యదర్శి కుంభం నాగమణి, సభ్యులు జాజుల తాతారావు, కొరసిక శ్రీనివాస్, గొరిపర్తి సుబ్బారావు, పెద్ది రమణ, పెద్దిబోయిన రామరావు, పల్లపోతు శ్రీరామ్ కరుణ పీఠం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ స్టేడియం డైరీని అవిష్కరించిన మంత్రి కొడాలి నాని



గుడివాడ : స్థానిక నందమూరి తారకరామరావు స్టేడియం రూపోందిచి 2022 డైరీనీ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) గురువారం తన కార్యలయంలో అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటి ఉపాధ్యక్షులు పాలేటి శివసుబ్రహ్మణ్యం(చంటి), సముంక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, సభ్యులు బొగ్గవరపు తిరపతయ్య, దొప్పలపూడి రవికుమార్, నెరుసు శేషగిరిరావు, చింతా రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

## తల మాల డేవిడ్ రాజ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్

నందిగామ జనవరి 6 ప్రజాపాలన ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీ నాయకులు తలమాలడేవిడ్ రాజు అయనతం డ్రి విశ్రాంత పోలీస్ అకాల మరణం చెందారు వీరిని పరామర్శించడానికి మాజీ ఎంపీ లగడపాటి రాజ గో పాల్ వారి స్వగృహానికి వచ్చేసి వారి కుటుంబాన్ని ప రామర్శించి ఓదార్చారు ఈ కార్యక్రమంలో వైసిపి నా యకులు పిల్లి జయరాజుపాలేటి సతీష్ తదిత రులు పాల్గొన్నారు

## ఆపద్బాంధవుడు వేగేశన నరేంద్ర వర్మ



బాపట్ల ప్రజాపాలన బ్యూరో :బాపట్ల పట్టణం మూర్తిరక్షణ నగర్ లో ఈ రోజు జరిగిన అగ్నిప్రమాదం లో సర్వస్వం కోల్పోయిన మల్లెల ఆనంద బాబు ని పరామర్శించి తన వంతు ఆర్థిక సహాయం అందచేసిన బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటరావు రాంబాబు రత్నం ఏర్మీయా సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన డ్యూయల్ టోన్ కలర్స్ లో టీవీఎస్ రెడియాన్ విడుదల



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి జనవరి,6 : ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన ద్విచక్ర మరియు మూడు చక్రాల వాహనాల తయారీదారు టీవీఎస్ మోటర్ కంపెనీ ఇప్పుడు టీవీఎస్ రెడియాన్ ను రెండు నూతన డ్యూయల్టన్ రంగులు , రెడ్ అండ్ బ్లాక్ మరియు బ్లూ అండ్ బ్లాక్ రంగుల నేపథ్యంలో విడుదల చేసింది . క్లాసిక్ మోటర్ సైక్లింగ్ ప్రపంచపు స్ఫూర్తితో ఈ రంగుల నేపథ్యాలను ఎంచుకున్నారు.ఈ నూతన డ్యూయల్ టోన్ ఎడిషన్ మరింతగా తమ వినియోగదారుల కోసం ఆహ్లాదకరమైన అంశాలను జోడించుకుంది . టీవీఎస్ రెడియాన్ వాహనాలు భావితరపు ఎకోథ్రస్ట్ ఫ్యూయల్ ఇంజెక్షన్ ( ఈటీ - ఎఫ్ఎస్ఐ ) సాంకేతికతను కలిగి ఉన్నాయి . ఇది 15 % అదనపు మైలేజీ అందించడంతో పాటుగా మెరుగైన ఇంజిన్ పనితీరు కలిగి ఉంటుంది.టీవీఎస్ రెడియాన్ డ్యూయల్ టోన్ వాహనాలు ఉత్సాహపూరితమైన నూతన ఫీచర్లు అయినటువంటి క్రోమ్ హెడ్ల్యాంప్ , నూతన క్రోమ్ రియర్ వ్యూ మిర్రర్స్ , ప్రీమియం డ్యాష్ బోర్డ్ , నూతన ఫ్రంట్ డిస్క్ బ్రేక్స్ , నూతన విస్తృతమైన థై ప్యాడ్ డిజైన్ మరియు ప్రీమియం కుషన్ సీట్లు వంటివి సుదీర్ఘ ప్రయాణాలకు అనువుగా ఉంటాయి . టీవీఎస్ రెడియాన్ వాహనాలు అత్యుత్తమ శ్రేణి ఫీచర్లు అయినటువంటి క్రోమ్ ష్రడ్స్తో సాలిడ్ రియర్ సస్పెన్షన్ బీ 18 అంగుళాల పెద్దవైన చక్రాలు , మెరుగైన స్థిరత్వం మరియు సౌకర్యం కోసం డ్యూయల్ గ్రిప్ టైర్లు ఉన్నాయి . ఈ సవారీ అనుభవాలు ఖచ్చితమైన సీటు ఎత్తు , అత్యధిక గ్రౌండ్ క్లియరెన్స్ , లాంగ్ వీల్ ఆధారిత మరియు ఆకట్టుకునే పనితీరు కలిగిన ఫీచర్లు అయినటువంటి యుఎస్బీ చార్జింగ్ స్పాట్ , సౌకర్యవంతమైన ఆల్ గేర్ సెల్ఫ్ స్టార్ట్ , బీపర్తో సైడ్ స్టాండ్ ఇండికేటర్ వంటి సౌకర్యవంతమైన ఫీచర్లతో పాటుగా సౌకర్యవంతమైన పిలాన్ గ్రాబ్ రైల్ కూడా కలిగి ఉంది.

## మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి ఆధ్వర్యంలో కన్వర్జెన్స్ సమావేశాలు

లింగాల,ప్రజాపాలన ప్రతినిధి: మండలం లోని జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ఓ టి ఎస్ విధానం పైన లింగాల మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి సురేంద్ర నాథ్ ఆధ్వర్యంలో కన్వర్జెన్స్ సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతిని పేదప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోమన్నూతల 83 మంది, కామసముద్రం 25 మంది, పెద్ద కూడాల 45 మంది, ఇప్పట్ల 61 మంది మండల వ్యాప్తంగా 214.మందికి అవకాశముందని తెలిపారు. అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ వై యస్ ఆర్ క్రాంతి పథం ఆంజనేయులు మాట్లాడుతూ సచివాలయ పరిధిలో వన్ టైమ్ సెటిల్మెంట్ కు అర్హత సాధించిన అత్యంత నిరుపేదలకు శాశ్వత గృహ హక్కు కల్పించడం లో స్వయం సహాయక సంఘాలు చర్చించి డ్వాక్రా మహిళా లబ్ధిదారులను సంబంధిత గ్రామ వాలంటీర్లు మరియు గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు పరిశీలించి పదివేల రూపాయలు చెల్లించుట లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి, డ్వాక్రా సంఘం అంగీకారంతో రుణ వసతి కల్పించడం జరుగుతుందని తెలిపారు. లింగాల మండల తహసీల్దార్ శ్రీ శేషారెడ్డి మాట్లాడుతూ జగనన్న సంపూర్ణ గృహ పథకం ద్వారా రిజిస్టర్ చేయించుకున్న లబ్ధిదారులకు గృహము పైన సంపూర్ణ హక్కులు బదలాయింపు జరుగుతుందని గృహ హక్కు పట్టాలు మంజూరు చేయడం జరుగుతుందని తద్వారా భవిష్యత్తులో లబ్ధిదారులు వారి ఆస్తిని వారి వారసులకు బదిలీ చేయుట మరియు విక్రయించటం లేదా బ్యాంకుల ద్వారా రుణాలు పొందుటకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ లు జ్యోతి జయపాల్ ఆంజనేయులు గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు హౌసింగ్ సిబ్బంది భాక్రా మహిళలు పాల్గొన్నారు.

## ముమ్మరంగా దాళ్వా వరి నాట్లు



గన్నవరం ప్రజా పాలన ప్రతినిధి జనవరి06: గన్నవరం నియోజకవర్గం విజయవాడ రూరల్ , గన్నవరం మండలాల్లో ప్రాంతాల్లో ముమ్మరంగా దాళ్వా వరి నాట్లు.. విజయవాడ రూరల్ మండల గ్రామాల్లో 1500 ఎకరాల దాళ్వా సాగుచేస్తున్నట్లు రూరల్ మండల వ్యవసాయ అధికారి హరీశ్ కుమార్ తెలిపారు. . నున్న, ముస్తాబాదు , చేరువుల్లో నిల్వ ఉంచిన పోలవరం కాల్వ నుంచి నీళ్లు అందుబాటులో. ఉండటంతో వరి , మొక్క జోన్న పంటలు సాగు చేస్తున్న రైతన్నలు .. కలకత్తా రాష్ట్రం నుంచి వచ్చిన కూలీలతో నారు తీయటం , వరినాట్లు వేయిస్తున్న రైతులు. కలకత్తా రైతులు నాట్లు దూరం దూరం నాటడం దిగుబడి అధికంగా వస్తుందన్న నమ్మకం తో వారి నాట్లు వేయిస్తున్నారు.

## యడవల్లి రైతులకు జరిగిన అన్యాయం పై మహా ధర్నాను విజయవంతం చేయండి

### ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు




చిలకలూరిపేట:(ప్రజాపాలన) రాష్ట్ర ప్రభుత్వం యడవల్లి రైతులకు ఇచ్చిన పరిహారంలో కొంత మంది బాధితులకు అన్యాయం జరిగిందని గత మూడు రోజులుగా సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షకు ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక తరపున సంఘీభావం తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి శ్రీను నాయక్, ప్రధాన కార్యదర్శి కుంభ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు దక్కవలసిన పరిహారం రైతులకు చెందనివకుండా కొంతమంది వ్యక్తులు చెక్కులు లాక్కోవడం చాలా దుర్మార్గమైన చర్య అనిఅన్నారు. సంబంధిత బాధితులు ఈ విషయాన్ని గత రెండు రోజుల క్రితం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు తెలియజేశారని అన్నారు. యడవల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాల పేరిట ఎకరం రూ.20 లక్షలకు కొనుగోలు చేసిందని, రైతులు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూమిలో గ్రానైట్ నిక్షేపాలు ఉన్నాయన్న కారణంతో రైతుల దగ్గర భూములు తీసుకుందని అన్నారు. అటువంటి భూములకు ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి 25 లక్షలు ప్రకటించి చేతులు దులుపుకుందని అన్నారు. కనీసం కోటి రూపాయలు విలువ చేసిన భూములకు తక్కువ మోతాదులో రుణాలు రైతులకు చెల్లించారని అన్నారు.

దాంట్లోనే కొంతమంది వ్యక్తులు రైతుల చెక్కులను మార్చి చాలా తక్కువ రుణం అందజేశారని బాధితులు ఈ విషయాన్ని ఆరోపిస్తున్నారని అటువంటి వ్యక్తుల పైన సంబంధిత అధికారులు కేసులు నమోదు చేయాలని అన్నారు. శుక్రవారం తాహసిల్దార్ కార్యాలయం ఎదుట జరిగే మహా ధర్నా కార్యక్రమానికి తమ వంతు మద్దతు తెలియజేయడమే కాకుండా, రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అదేవిధంగా రైతులకు మద్దతు తెలియజేసేందుకు పలు రాజకీయ పార్టీల నాయకులు,ప్రజా సంఘాల నాయకులు, ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనార్టీ నాయకులు వారి వంతుగా మద్దతు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు, చిలకలూరి పేట డివిజన్ కెవిపిఎస్ నాయకులు సాతులూరి బాబు, ప్రజానాట్యమండలి నాయకులు పెద్దిరాజు.,చర్మకారులు,డప్పు కళాకారుల సంఘం చిలకలూరిపేట మండల అధ్యక్షులు కాకాని రోశయ్య, తో పాటు మహిళా సంఘం నాయకులు, యడవల్లి బాధిత రైతులు పాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి: రైతుసంఘం, సీపీఐ నాయకులు



చిలకలూరిపేట:(ప్రజాపాలన)భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని 'జాతీయ విపత్తు' గా ప్రకటించి అన్ని విధాలుగా రైతాంగాని ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ , ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలను మద్దతు ధర ప్రకటించాలని, మిర్చి, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని, సూక్ష్మ నీటి సేద్యపు పరికరాలపై, వ్యవసాయ యంత్రాలపై గతంలో యిస్తున్న రాయితీని పునరుద్ధరించాలని తదితర డిమాండ్లతో గురువారం పట్టణంలోని ఎన్ ఆర్టీ రోడ్డులో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 80 వేల ఎకరాల్లో మిర్చి, ప్రత్తి, మినుము, అరటి తదితర ఉద్యాన పంటలు, లక్షకు పైగా ఎకరాల్లో వరి పంట నష్టపోవటం జరిగిందని, జిల్లా వ్యాపితంగా మిర్చి పంటకు వైరస్ (తామర పురుగు) సోకి పంట నాశమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మిర్చి పంట పీకి వేసి దిక్కుతోచని స్థితిలో వున్నారని, ఎకరాకు లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులను ఆదుకునేందుకు ఎకరాకు రూ. 50 వేల వంతున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తడిసిన వరి ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని,పంటలు నష్టపోయిన రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇచ్చి ప్రత్యామ్నాయ పంటల సాగుకు చర్యలు తీసుకోవాలని, ఖరీఫ్, రబీలలోని వ్యవసాయ రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని, దేవాదాయ భూముల్లో పంట నష్టపోయిన కౌలు రైతులకు కౌలు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమానికి రైతు సంఘం ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు అధ్యక్షత వహించగా, సీపీఐ ఏరియా ఇన్చార్జి కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుబాని, నాయకులు పేలూరి రామారావు, చంద్రా కొండలరావు, కొంద్రగుంట వెంకట్రావు, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

## యస్టీయూ ఆధ్వర్యంలో 75వసంతాల వజ్రోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



చిలకలూరిపేట :(ప్రజాపాలన)పట్టణంలోని యస్టీయూ ప్రాంతీయకార్యాలయంలో యస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె..కోటేశ్వరరావు కరపత్రాలను ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.స్వాతంత్ర్యానికి పూర్వమే నిజాం నిరంకుశవైఖరికి వ్యతిరేకంగా ఉపాధ్యాయ సంఘం స్థాపించి విద్యారంగ అభివృద్ధికి ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషిచేసిన,పోరాడిన ఏకైక సంఘం రాష్ట్రోపాధ్యాయ సంఘం అన్నారు. ఉపాధ్యాయ హక్కులసాధనే ఏకైక లక్ష్యం అనే నినాదంతో ఉపాధ్యాయులను చైతన్య పరచి అనేక ఉద్యమాలను నిర్మించిన సంఘం యస్టీయూ అన్నారు.ఉపాధ్యాయ విద్యారంగ సంక్షేమం కోసం ఉపాధ్యాయవాణి పత్రికను నడుపుతుందన్నారు.వీణావిజయరామరాజు,వి.పి.రాఘవాచారి,శ్యాంసుందర్ రావు,శ్రీరామమూర్తి,ముగ్ధూం మొయిద్దీన్ గార్ల స్ఫూర్తితో ఉపాధ్యాయుల పాఠశాలల బలోపేతానికి ఐక్యంగా కృషిచేసిన సంఘమన్నారు. జిల్లా మహిళాకార్యదర్శి యం.శారద, యస్టీయూ పట్టణ ప్రధానకార్యదర్శి. షేక్.జమ్షీర్ బాషా, నాదెండ్ల మండల అధ్యక్షులు.యం.ప్రసన్న కుమార్ చిలకలూరిపేట మండల అధ్యక్షులు పఠాన్ అజ్మీర్ ఆలీఖాన్ ప్రధాన కార్యదర్శి మస్తాన్ వలి, అదనపు ప్రధానకార్యదర్శి, యం.చినవేంకటస్వామి,ఉపాధ్యక్షులు అట్లూరి.శ్రీనివాసరావు,ఫరీసా, రామాంజనేయులు, యస్టీయూ సీనియర్ నాయకులు చావలి.మల్లేశ్వరరావు, జిల్లాకౌన్సిలర్స్ వినుకొండ. అక్కయ్య, రాష్ట్ర కమిటీ కన్వీనర్,ఏరియా కార్యదర్శి పోటు.శ్రీనివాసరావు పాల్గొని సీనియర్ నాయకుల,త్యాగాల స్ఫూర్తితో అందరం పని చేయాలన్నారు.ఆదివారం గుంటూరులో జరిగే యస్టీయూ జిల్లా వజ్రోత్సవాలు,వార్షిక కౌన్సిల్ సమావేశాలలో అధిక సంఖ్యలోఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

## మధురానగర్ రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం వైఎస్సార్ సీపీ వైపే ఉంటుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు గారు అన్నారు. మధురానగర్ లో రూ. 18 కోట్ల నిధులతో జరుగుతున్న రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పనుల పురోగతిని వైసీపీ కార్పొరేటర్లు కొంగితల లక్ష్మీపతి, పెనుమత్స శిరీష సత్యం గారితో కలిసి ఆయన పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన ప్రణాళికల ప్రకారం పనులు జరగాలని.. ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు పరస్పరం చర్చించుకుని పనులు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. పనుల నిర్వహణలో సమస్యలు ఏమైన తలెత్తితే తక్షణం తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం మల్లాది విష్ణు గారు మీడియాతో మాట్లాడుతూ.. వరుస ఓటములతో తెలుగుదేశం నాయకుల మతిభ్రమించిందని అన్నారు. క్యాడర్ జారిపోకుండా ఉండేందుకే చంద్రబాబు మధ్యంతర ఎన్నికలంటూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మరోవైపు సెంట్రల్ నియోజకవర్గంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి హయాంలోనే మధురానగర్ లో రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి(ఆర్.యు.బి.) మంజూరై పనులు ప్రారంభించినట్లు మల్లాది విష్ణు గారు వెల్లడించారు. కానీ గత తెలుగుదేశం ప్రభుత్వం పనులలో పూర్తి నిర్లక్ష్యం వహించిందన్నారు. మరలా వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కరోనా తీవ్రత మరియు వర్షాకాలం కారణంగా పనులలో కొంత జాప్యం జరిగినట్లు వివరించారు. మరో 4 నెలల్లో పనులను త్వరితగతిన పూర్తి చేసి నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలియజేశారు. ఈలోగా ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాఫిక్ సిబ్బందిని ఆదేశించారు. వాహనదారులు ఇబ్బందులు పడకుండా రహదారిలో ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతించే విధంగా సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పర్యటనలో నాయకులు పిల్లి మురళి, శనగశెట్టి హరిబాబు, ఉద్దంటి సురేష్, కోలుకొండ శ్రీనివాసరావు, సీహెచ్. గోవింద్, ఎస్.గోవింద్, దేవినేని శివాజీ, దేవినేని సుధాకర్, విజయలక్ష్మి, చినబాబు, కిరణ్, ఈఈ శ్రీనివాస్, డీఈ గురునాథం, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఉన్నత పాఠశాల ను తనిఖీ చేసిన మున్సిపల్ ఆర్డీ



చిలకలూరిపేట:(ప్రజాపాలన) పట్టణంలోని సుగాలీకాలనీ నందు గల మున్సిపల్ ఉన్నత పాఠశాలను పురపాలకపరిపాలనాశాఖ ప్రాంతీయ శాఖ సంచాలకులు గుంటూరు జి.శ్రీనివాసరావు తనిఖీ చేశారు.విద్యార్థులతో ఫిజిక్స్ సబ్జెక్ట్ గురించి అడిగారు.నోట్ బుక్స్ పరిశీలించారు.బోధన గురించి అడిగి తెలుసుకున్నారు.నూతనంగా ఉన్నత పాఠశాల గా ఏర్పడినందున విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,తరగతి గదులు అవసరత గురించి, మధ్యాహ్నభోజనం అమలు గురించి ,విద్యార్థుల నమోదు హాజరు ,ఉపాధ్యాయుల వివరాలు సేకరించారు. అనంతరం మధ్యాహ్నభోజనం వంటగదిలో పరిశీలించారు. మెనూపాటించాలని .పరిశుభ్రత పాటించాలని భోజన సిబ్బంది కి సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలోని తరగతులను తనిఖీచేశారు.మున్సిపల్ కమీషనర్ డి.రవీంద్ర,డీఈఈ షేక్ అబ్దుల్ రహీం ఏ.ఈ,కోటేశ్వరరావు, మున్సిపల్ హైస్కూల్స్ సూపర్ వైజర్ కె.కె.దీక్షితులు,ప్రాథమిక పాఠశాల సూపర్ వైజర్ పోటు.శ్రీనివాసరావు.ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐలా.కల్పన,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యస్.కోటేశ్వరమ్మ,శానిటరీ ఇన్స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్ .ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తోడు వృద్ధాశ్రమంలో కపిలవాయి విజయ్ కుమార్ జన్మదిన వేడుకలు



నరసరావుపేట.ప్రజాపాలన : నరసరావుపేట ప్రముఖులు రాష్ట్ర బులియన్ మర్చెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి విజయ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ది టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ... మహేష్ బాబు యువశక్తి ఆధ్వర్యంలో తోడు వృద్ధాశ్రమంలో పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువశక్తి పట్టణ అధ్యక్షులు పరుగుఫారూఖ్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక 9వ వార్డులో ని తోడు వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించి కేకును కట్ చేశారు. అనంతరం ఆశ్రమంలోని మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ తన జన్మదినం రోజున ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నపురెడ్డి తిరుపతయ్య , షంషీర్, కరిముల్లా, మహేష్ బాబు , వెంకయ్య, వేద కుమార్, రమేష్ బాబు, ఏసుబాబు వెంకట్రావు కోటయ్య మేస్త్రి ,కట్ట గురవయ్య, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


## క్రీ:శే కందలగడ్డ రామయ్య వర్ధంతి సందర్భంగా స్పందన కు నిత్యావసర వస్తువులు




గన్నవరం ప్రజా పాలన ప్రతినిధి జనవరి 06: క్రీ :శే కందలగడ్డ రామయ్య గారి వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు గన్నవరం జ్యోతిర్మయి జ్యూయలర్స్ అధినేత నాగేశ్వరరావు కోడలు గీతకుమారి మనవడు లక్ష్మణ్ గార్లు స్పందన మానసిక కేంద్రానికి గురువారం నాడు నిత్యావసర వస్తువులు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్ మాట్లాడుతూ దివ్యాంగులకు సహాయం చెయ్యడం అంటే స్వయంగా భగవంతునికి చేసినట్లు అని ఆమె అన్నారు.రామయ్య గారి ఆత్మకు శాంతి కలగాలని వారి కుమారుడు నాగేశ్వరరావు గారి వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని,వారికి మంచి స్థాయి భగవంతుడు ఇవ్వాలని రజిత వెంకట్ కోరారు.ఎంత ఉన్నప్పటికీ దివ్యాంగులకు పేదలకు వృద్ధులకు సహాయం చేసినప్పుడే జీవితాని ఒక అర్ధమని అదే సార్థకత ఆమె అన్నారు నాగేశ్వరరావు గీతకుమారి గార్ల కు రజిత వెంకట్ ధన్యవాదాలు తెలిపారు

# పంజాబ్ షా ఎవరు...?

పంజాబ్‌లో ఇప్పుడు విచిత్రమైన సన్నివేశం కనిపిస్తోంది. ఓ పక్కేమో కరోనాను కట్టడి చేయడం కోసం కఠినమైన ఆంక్షలు. మరో పక్కేమో ఆ మహమ్మారికి స్వాగతం పలుకుతూ ఎన్నికల ర్యాలీలు..ఇవాళ కాకపోతే రేపైనా కరోనాను కంట్రోల్ చేయవచ్చు. కానీ, అయిదేళ్లకోసారి వచ్చే ఎన్నికలలో ఆ మాత్రం సందడి లేకపోతే ఎలా అన్నది రాజకీయ పార్టీల భావన కావొచ్చు. మహా అయితే మరో రెండు నెలల సమయమే మిగిలి ఉంది కాబట్టే రాజకీయపార్టీలు ఎన్నికల సమరాంగణంలో అనుసరించాల్సిన వ్యూహాలపై కసరత్తులు మొదలు పెట్టాయి. భారతీయ జనతాపార్టీ పంజాబ్‌పై పెద్దగా ఆశలు పెట్టుకోకపోయినా ఏమో గుర్రం ఎగరావచ్చుననే చిగురంత ఆశతో జోరుగా ప్రచారం చేస్తోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా పంజాబ్‌పై గట్టి ఫోకసే పెట్టారు. చలికాలంలోనూ ప్రధాన రాజకీయ పార్టీలు చేసుకుంటున్న విమర్శలు, ఆరోపణలు వేడి పుట్టిస్తున్నాయి. ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు అత్యంత కీలకంగా మారాయి. అధికారాన్ని నిలుపుకోవడం కాంగ్రెస్ ముందున్న ప్రధాన లక్ష్యం. కాంగ్రెస్ పని అయిపోయిందనుకుంటున్న వారికి ఈ విజయంతో ఓ సమాధానం చెప్పాలని కూడా అనుకుంటోంది.. ఇప్పటికే బోలెడన్ని హామీలను గుప్పించింది. మొన్నటి చండీగఢ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయంతో ఆమ్ ఆద్మీ పార్టీ జోష్ మీద ఉంది. సర్వేలు కూడా ఆప్‌కు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతుండటంతో దూకుడు పెంచింది. పకడ్బందీ వ్యూహంతో ప్రచారంలో దూసుకుపోతున్నది. సీఎం అభ్యర్థిగా ఎంపీ భగవంత్ మాన్ పేరును ప్రకటించింది కూడా ! నెల రోజుల కిందట బీజేపీపై భగవంత్‌మాన్ సంచలన ఆరోపణలు చేశారు. తమ పార్టీలో చేరితే డబ్బు, కేంద్ర మంత్రి పదవి ఇస్తామంటూ బీజేపీకి చెందిన ఓ ప్రముఖ నేత తనకు ఆఫర్ చేశారని, అయితే ఆ ఆఫర్‌ను తాను తిరస్కరించారని భగవంత్ మాన్ చెప్పడం సంచలనం సృష్టించింది. డబ్బుతోనో, పదవితోనో తనను కొనాలనుకోవడం మూర్ఖత్వమని కూడా చెప్పారు. బీజేపీ రాజకీయాలన్ని ఇలాగే ఉంటాయని, ఇతర పార్టీల నుంచి రాజకీయ నాయకులను తీసుకోవడంపైనే బీజేపీ దృష్టి పెడుతుందని, ప్రజా సమస్యలు ఆ పార్టీకి పెద్దగా పట్టమని అన్నారు. ఈ విషయాన్ని వదిలేస్తే ఆప్ మాత్రం ఈసారి ఎలాగైనా అధికారం సాధించాలనే గట్టి పట్టుదలతో ఉంది. కాంగ్రెస్ పార్టీలో




ఉన్న వర్గ పోరు, ఆకాలీదళ్ పార్టీ బలహీనపడటం, రైతులు బీజేపీ పట్ల వ్యతిరేకంగా ఉండటం ఆప్‌కు బాగా కలిసివస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్‌ను, ఉచిత తాగునీటిని అందిస్తామని ఆల్‌రెడీ చెప్పిన ఆప్ కీలక రంగాలైన విద్య, వైద్యంపై కూడా ఫోకస్ పెట్టింది. గత ఎన్నికల్లో 20 స్థానాలను సంపాదించి పంజాబ్ అసెంబ్లీలో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించింది. పైగా 23.72 శాతం ఓట్లను సంపాదించింది. అప్పట్నుంచే అధికారం దిశగా అడుగులు వేస్తూ వచ్చింది. గత ఎన్నికల్లో లోక్ ఇన్సాఫ్ పార్టీతో జత కట్టిన ఆప్ ఈసారి ఒంటరిగానే బరిలో దిగాలనుకుంటోంది. అప్పుడు లోక్ ఇన్సాఫ్ పార్టీకి ఆరు సీట్లు కేటాయించింది. అందులో రెండు స్థానాలను గెల్చుకుంది.. ఈ ఎన్నికల్లో ఆప్‌ను గెలిపించే బాధ్యతను అరవింద్ కేజ్రీవాల్ తన భుజ స్కంధాల మీద వేసుకున్నారు. ఇప్పటికే నాలుగు విడతల్లో 73 మంది అభ్యర్థుల పేర్లను ఆప్ ప్రకటించింది. కేజ్రీవాల్ జనాకర్షణ ఎంత వరకు ఓట్ల రూపంలో కన్వర్ట్ అవుతుందో చూడాలి. శిరోమణి అకాలీదళ్ పదేళ్ల పాటు పంజాబ్‌లో అధికారంలో ఉండింది. అప్పుడే ఆ పార్టీపై అవినీతి ఆరోపణలు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. మరోవైపు విచ్చల విడిగాపెరిగిన డ్రగ్స్ వాడకం కూడా ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చిపెట్టింది. ఈ కారణంగానే 2017లో జరిగిన ఎన్నికల్లో ఓటమి చవి చూసింది. కేవలం 15 అసెంబ్లీ స్థానాలను మాత్రమే సాధించగలిగింది. ఈసారైనా గణనీయంగా సీట్లు సాధించాలనుకున్న అకాలీదళ్‌కు తమ భాగస్వామ్య మిత్రపార్టీ బీజేపీ తెచ్చిన మూడు సాగు చట్టాలు ఆందోళన కలిగించాయి. వెంటనే బీజేపీతో రెండు దశాబ్దాల అనుబంధాన్ని తెంచేసుకుంది. అకాలీదళ్ పార్టీ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ సతీమణి హర్‌సిమ్రత్ కౌర్ కూడా కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి అకాలీదళ్ అసెంబ్లీ ఎన్నికల మీద దృష్టి పెట్టింది..రైతుల మద్దతు కూడగట్టుకోవడం కష్టంగా భావించిన అకాలీదళ్ దళితలపై ఫోకస్ పెట్టింది. ఎందుకంటే పంజాబ్‌లో 32 శాతం మంది దళితులే ఉన్నారు కాబట్టి. పైగా మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్‌పార్టీతో పొత్తు కూడా పెట్టుకుంది. 20 స్థానాలు బీఎస్‌పీకి కేటాయించింది. 2017 ఎన్నికల్లో 111 స్థానాల్లో పోటీ చేసిన బీఎస్పీకి 110 నియోజకవర్గాలలో డిపాజిట్లు కోల్పోయిందన్న విషయం గమనార్హం. సాధించిన ఓట్లు కూడా 1.59 శాతమే. అయితే ఈసారి మాత్రం దళితుల ఓట్లను సంపాదించడంలో మాయావతి సాయపడగలరని అకాలీదళ్ భావిస్తోంది. ఇప్పటికే 91 స్థానాలలో అభ్యర్థులను ప్రకటించింది కూడా. వీరంతా తమ తమ నియోజకవర్గాలలో ప్రచారం మొదలు పెట్టేశారు కూడా!అధికార కాంగ్రెస్ పార్టీకి కూడా కొన్ని ఇబ్బందులు తప్పడం లేదు. అమరీంద్ సింగ్ పార్టీని వదిలిపెట్టేసి పంజాబ్ లోక్ కాంగ్రెస్ పేరుతో కొత్త పార్టీ పెట్టుకున్నారు.. దీని ప్రభావం ఎంతో కొంత కాంగ్రెస్‌పై పడుతుందని కొందరు అంటున్నారు .. బీజేపీతో అమరీందర్ పెట్టుకున్న పొత్తు పెద్దగా వర్క్అవుట్ కాకపోవచ్చని మరికొందరు విశ్లేషిస్తున్నారు. 2017లో అకాలీదల్‌తో పొత్తు పెట్టుకున్న బీజేపీ 23 స్థానాలలో పోటీ చేసింది.. కేవలం మూడు స్థానాలలో మాత్రమే గెలుపొందింది. అప్పుడు బీజేపీకి వచ్చిన ఓట్ల శాతం 5.39. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం పోటీ చేసిన మూడు స్థానాలలో విజయం సాధించింది బీజేపీ. పైగా తమ ఓట్ల శాతాన్ని 9.63కు పెంచుకుంది కూడా! ఇప్పుడు అమరీందర్ సింగ్ ప్లస్ బీజేపీ కలిసి ఎన్ని స్థానాలు గెల్చుకోగలరన్నదే ప్రశ్న. సాగు చట్టాల రద్దుతో రైతులు సంతృప్తి చెందారా? నరేంద్రమోదీ కరిష్మా ఏ మేరకు పని చేయగలదు? అమరీందర్ సింగ్ కాంగ్రెస్ ఓట్లను చీల్చగలరా? ఇలాంటి ప్రశ్నలన్నీ ఉత్పన్నం అవుతున్నాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి చరణ్‌సింగ్ చన్నీ, పీసీసీ చీఫ్ నవజ్యోత్ సింగ్ సిద్ధు మధ్య సయోధ్య కుదిరినట్టే అనిపిస్తోంది. అయినప్పటికీ సిద్దు ఎప్పుడు ఏం మాట్లాడతారో, ఎప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఆందోళన మాత్రం కాంగ్రెస్‌లో అలాగే ఉంది. దళితుల ఓట్ల కోసమే చన్నీకి ముఖ్యమంత్రి పదవి అప్పగించారని, ఇప్పుడు జరగబోతున్న ఎన్నికల్లో కూడా చన్నీనే ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని అంటున్నాయి ప్రతిపక్ష పార్టీలు. కాంగ్రెస్ మాత్రం ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించడానికి వెనకాముందు అవుతోంది. ముఖ్యమంత్రి పదవిపై ఎప్పట్నుంచో ఆశలు పెట్టుకున్న సిద్దును కాదనలేదు కాంగ్రెస్. ఎందుకంటే ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్న క్రౌడ్ పుల్లర్ ఆయనొక్కడే! ఇప్పుడు పంజాబ్‌లో సంయుక్త సమాజ్ మోర్చా పేరుతో కొత్త పార్టీ వచ్చింది. సాగుచట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన 22 రైతు సంఘాలు కలిసి పెట్టుకున్న పార్టీ ఇది! మొత్తంగా పంజాబ్ ఎన్నికలు అప్పుడు ఆసక్తిగా మారాయి. ఉత్తరప్రదేశ్ తర్వాత ఎన్నికల విశ్లేషకులు ఎక్కువగా దృష్టి పెడుతున్నది పంజాబ్‌పైనే!

## తెలంగాణలో మారుతున్న లెక్కలు

హైదరాబాద్, జనవరి 6, :తెలంగాణలో టిఆర్ఎస్, బిజెపి పార్టీల మధ్య రాజకీయ యుద్ధం ఏ స్థాయిలో జరుగుతుందో చెప్పాల్సిన పని లేదు. రెండు పార్టీలు నువ్వా-నేనా అన్నట్లు తలపడుతున్నాయి. అసలు రెండు పార్టీల మధ్య వార్ పీక్స్‌కు చేరుకుంది. అంటే తెలంగాణ రాజకీయాలు మొత్తం ఆ రెండు పార్టీల చుట్టూనే తిరుగుతున్నాయి. ఇక ఇక్కడ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ మాత్రం పూర్తిగా వెనుకబడింది. అసలు తెలంగాణలో టీఆర్ఎస్ తర్వాత బలంగా ఉన్న పార్టీ కాంగ్రెస్ మాత్రమే. బీజేపీకి అసలు రాష్ట్ర స్థాయిలో బలం లేదు. కాకపోతే ఉపఎన్నికల్లో గెలిచాక సీన్ మారింది?బీజేపీ కూడా పుంజుకుంది. కానీ బీజేపీకి కాంగ్రెస్ అంత బలం లేదు. అయినా సరే టీఆర్ఎస్ తర్వాత బీజేపీ సెకండ్ ప్లేస్‌లో ఉన్నట్లు వార్ నడుస్తోంది. దీంతో రేసులో కాంగ్రెస్ వెనుకబడినట్లు కనిపించింది. పైగా టీఆర్ఎస్ సైతం బీజేపీనే ప్రధాన ప్రత్యర్థిగా చూస్తూ.. ఆ పార్టీపై విమర్శలు చేస్తుంది. కానీ కాంగ్రెస్‌పై ఫోకస్ చేయడం లేదు. దీంతో కాంగ్రెస్ పూర్తిగా వెనుకబడిపోయినట్లు అయింది. అంటే తెలంగాణలో ఇప్పుడు కాంగ్రెస్ థర్డ్ పొజిషన్‌కు పడిపోయిందని విశ్లేషణలు మొదలయ్యాయి. అయితే ఇదంతా ఒక డ్రామా అని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అంటున్నారు. ప్లాన్ ప్రకారమే కాంగ్రెస్‌ని దెబ్బకొట్టడానికి టీఆర్ఎస్-బీజేపీలు కలిసి డ్రామా ఆడుతున్నాయని అంటున్నారు. ఎందుకంటే టీఆర్ఎస్ కావాలని బీజేపీని పైకి లేపుతుందని, అప్పుడు కాంగ్రెస్ మూడో ప్లేస్‌లో ఉందని చూపించాలని అలా చేస్తున్నారని చెబుతున్నారు. బీజేపీని పైకి లేపి కాంగ్రెస్‌ని తక్కువ చేయడం వల్ల?ఓట్లలో చీలిక వచ్చి టీఆర్ఎస్‌కు లబ్ది జరుగుతుందనేది కేసీఆర్ ప్లాన్ అని అంటున్నారు. అంటే కాంగ్రెస్ ప్రత్యామ్నాయంగా ఎదిగితే ఇబ్బంది కాబట్టే బీజేపీని లేపుతున్నారని, ఇదంతా ప్లాన్ ప్రకారమే జరుగుతుందని అంటున్నారు. అయితే ఎవరి వ్యూహాలు వారికి ఉంటాయి?వాటిని చేధించి పార్టీని రేసులో నిలబెట్టాల్సిన బాధ్యత రేవంత్‌ది. అలా కాకుండా రెండు పార్టీలు డ్రామా ఆడుతున్నాయని విమర్శలు చేయడం వల్ల ఉపయోగం ఉండదు?ఇంకా కాంగ్రెస్ మూడో ప్లేస్‌లోనే ఉంటుంది.

## సైడ్ ట్రాక్ పడుతున్న సెకండ్ డోస్

అదిలాబాద్, జనవరి 6, :మళ్లీ కరోనా విజృంభిస్తున్న వేళ.. అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంలా మారింది. వైరస్ బారిన పడకుండా ఉండేందుకు వ్యాక్సినే శ్రీరామ రక్ష అని, వ్యాక్సిన్ వేయించుకోవాలని ఓ వైపు ప్రజలకు చెబుతున్న అధికారులు.. మరోవైపు తీవ్రమైన నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. వ్యాక్సిన్ వేయకుండానే వేసినట్లుగా చూపుతున్నారు. టార్గెట్ రీచ్ కావడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. ఫలితంగా సెకండ్ డోస్ సైడ్ ట్రాక్ పడుతోంది. నిర్మల్ జిల్లా భైంసాలో అధికారుల నిర్వాకం వెలుగు చూసింది. వివరాల్లోకెళితే.. కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రక్రియను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకుంటే, అధికారులేమో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించాల్సిన వైద్యారోగ్య సిబ్బంది టార్గెట్ రీచ్ కావడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. తెలంగాణలో ఫస్ట్ డోస్ తీసుకున్నవాళ్లలో మెజారిటీ పీపుల్‌కి సెకండ్ డోస్ కంప్లీట్ కాలేదు. సెకండ్ డోస్ వేయడానికి గడువు కంప్లీట్ కాకపోవడం ఒక కారణమైతే, ప్రజల నిర్లక్ష్యం మరో కారణం. దీన్నే వైద్యారోగ్యశాఖ సిబ్బంది అడ్వాంటేజ్‌గా తీసుకున్నారో ఏమో తెలియదు గాని, నిర్మల్ జిల్లాలో టార్గెట్ రీచ్ కావడానికి అడ్డదారులు తొక్కారు. సెకండ్ డోస్ వేయకపోయినా, వేసినట్లుగా ఫోన్లకు మెస్సేజ్‌లు పంపారు. రెండు డోసులు కంప్లీటైనట్టు సర్టిఫికెట్లు కూడా ఇచ్చేశారు. భైంసా మండలం మహాగామ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అయితే 100శాతం వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తయినట్లు రికార్డుల్లో చూపారు. సెకండ్ తీసుకోకపోయినా తీసుకున్నట్లు ఫోన్లకు మెసేజ్‌లు రావడంతో అవాక్కయిన జనం వ్యాక్సినేషన్ సెంటర్లకు క్యూ కట్టారు. భైంసా ఏరియా ఆస్పత్రికితోపాటు బాసర, ముధోల్, తానూరు, కుభీర్, మహాగామ్, కుంటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను చుట్టుముట్టారు. సెకండ్ డోస్ వేయకుండానే వేశారని ఎలా మెసేజ్ పంపారంటూ నిలదీశారు. జనం నిలదీయడంతో వైద్యాధికారులు కవర్ చేసుకునే ప్రయత్నం చేశారు. సాంకేతిక లోపం అంటూ సాకులు చెబుతున్నారు. పైనుంచి వస్తున్న ఒత్తిళ్ల కారణంగానే టార్గెట్ రీచ్ కాకపోయినా, వంద శాతం వ్యాక్సినేషన్ జరిగినట్టు, ఇలా మెస్సేజ్‌లు పంపినట్లు తెలుస్తోంది. ఇప్పుడైనా వ్యాక్సినేషన్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలాఉంటే.. తెలంగాణలో కోవిడ్ థర్డ్ వేవ్ ఉధృతి మొదలైంది. కరోనా పడగ విప్పింది. ఒక్కరోజే వెయ్యికి పైగా కేసులు నమోదు అయ్యాయి. ఒక్కరోజే తెలంగాణలో 1052 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. ఇద్దరు మృతి చెందారు. వీటితో పాటు మరో 10 ఒమిక్రాన్ కేసులు కావడం ఆందోళన కల్గిస్తోంది. ఒమిక్రాన్ కేసుల సంఖ్య రాష్ట్రంలో అధికారికంగా 94కి చేరింది. ఇప్పటికే ఒమిక్రన్ తెలంగాణలో సామాజిక వ్యాప్తి జరిగిపోయిందని వైద్యశాఖ ఉన్నతాధికారులే హెచ్చరిస్తున్నారు.

## భూమి మీదకు దూసుకొస్తున్న శకలం

న్యూయార్క్, జనవరి 6, :ఓ భారీ గ్రహశకలం భూమి వైపునకు దూసుకొస్తోంది. ఇదిప్పుడు కరోనా కంటే ఎక్కువగా శాస్త్రవేత్తలను భయపెడుతోంది.. ఈ గ్రహ శకలం సైజులో అత్యంత భారీ పరిమాణంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని, దాని వేగం కూడా ఇదివరకటి అస్టరాయిడ్లతో పోల్చుకుంటే.. రెట్టింపు ఉందని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా ' చెబుతోంది. కొద్ది రోజుల్లో ఈ గ్రహశకలం భూకక్ష్యలోకి ప్రవేశించే ప్రమాదం ఉందని నాసా శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ గ్రహశకలం పరిమాణం సుమారు 3,280 అడుగులుగా ఉందని అంచనా వేస్తున్నారు. న్యూయార్క్‌లోని ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ ఎత్తు దాని అంచు వరకూ లెక్కస్తే 443 మీటర్లు. తాజగా భూమి వైపు దూసుకొస్తున్న గ్రహశకలం న్యూయార్క్ ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ కంటే రెండున్నర రెట్లు పెద్దది. కాలిఫోర్నియాలోని గోల్డెన్ గేట్ బ్రిడ్జ్ సైజు ( 2,737 మీటర్లు పొడవు) కంటే పెద్దగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు ఈ గ్రహశకలాన్ని 7482 (1994పీసీ1) అనే నెంబరుతో పిలుస్తున్నారు. నిజానికి ఈ గ్రహశకలం ఇప్పటిది కాదు. దీనిని 1994లో మొదట గుర్తించారు. 1994 ఆగస్టు 9న ఆస్ట్రేలియాలోని సైడింగ్ స్ప్రింగ్ అబ్జర్వేటరీ సైంటిస్ట్ రాబర్ట్ మెక్‌నాట్ దీన్ని కనుగొన్నారు. భవిష్యత్తులో ఇది భూమికి అత్యంత సమీపానికి వస్తుందంటూ అప్పట్లో రాబర్ట్ మెక్‌నాట్ అంచనా వేశారు. ఆ అంచనా ఇప్పుడు వాస్తవ రూపం దాల్చుతోంది. ఈ గ్రహశకలం వేగం సెకనుకు 19.56 కిలోమీటర్లు. అంటే కన్నుమూసి తెరిచే లోపలే మాయం అయ్యేంత వేగంతో ఇది ప్రయాణిస్తోంది. గంటకు 43,754 మైళ్లతో భూకక్ష్య వైపునకు దూసుకొస్తోందని నాసా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీన ఈస్టర్న్ టైమ్ జోన్ (ఈఎస్టీ) ప్రకారం సాయంత్రం 4:51 నిమిషాలు, కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైమ్ జోన్ ప్రకారం.. ఉదయం 9:23 నిమిషాలకు ఈ అస్టరాయిడ్ భూమికి అత్యంత సమీపానికి చేరుకుంటుందని, అదే వేగంతో విశ్వాంతరాల్లోకి దూసుకెళుతుందని పేర్కొన్నారు. అత్యంత సమీపానికి వచ్చినప్పుడు భూమికి, ఈ గ్రహశకలానికి మధ్య ఉండే దూరం 1.2 మిలియన్ మైళ్ళు ఉంటుంది. ఇది భూమికి-చంద్రుడికి మధ్య ఉన్న దూరంతో పోల్చుకుంటే 5.5 రెట్లు ఎక్కువ. దీనివల్ల భూమికి వచ్చే ప్రమాదం ఏదీ లేదని నాసా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే, దాని ప్రభావం వల్ల శాటిలైట్ నెట్‌వర్క్స్ ప్రభావితమౌతాయని అంచనా వేస్తున్నారు. అదొక్కటే కాకుండా.. మరిన్ని అస్టరాయిడ్లు ఈ నెలలోనే భూకక్ష్యను సమీపిస్తాయని నాసా అంటోంది. ఏడు మీటర్ల వ్యాసం గల 2014 వైఈ15 తోకచుక్క ఈ జనవరి 6 నాడు భూమికి 4.6 మిలియన్ మైళ్ల దూరం నుంచి వెళుతుంది. నాలుగు మీటర్ల పొడవు ఉండే 2020 ఎపీ1 గ్రహశకలం జనవరి 7న భూమికి 1.08 మిలియన్ మైళ్ల దూరం నుంచి దూసుకెళ్తుంది. 2013 వైడీ48 అనే మరో అస్టరాయిడ్.. భూమికి 3.48 మిలియన్ మైళ్ల దూరం నుంచి ప్రయాణిస్తుంది. గ్రహశకలాలు సూర్యుని చుట్టూ తిరిగే చిన్న, రాతి వస్తువులు. ఇవి సూర్యుడి చుట్టూ తిరుగుతుంటాయి. అయితే గ్రహాల కంటే చాలా చిన్నవి. వీటిలో వందల మైళ్ల నుంచి అనేక అడుగుల పరిమాణం వరకూ లక్షలాది గ్రహ శకలాలు ఉన్నాయి. గ్రహశకలాల వార్తల గురించి మనం పెద్దగా పట్టించుకోం ఆవిర్భావం, డైనోసార్ల శకం ముగియడం వంటి ఎన్నో



పరిణామాలకు ఆస్టరాయిడ్స్‌కు లింకుంది. ఏ గ్రహశకలం ఎలాంటి ముప్పు తెస్తుందో చెప్పలేం అందువల్ల దూసుకొచ్చే ప్రతీ శకలాన్ని నిశితంగా ఖగోళ శాస్త్రవేత్తలు పరిశీలిస్తారు. మొన్న జూలై 24న కూడా “2008 గో20” అనే గ్రహ శకలం కూడా భూమికి చేరువగా వచ్చింది. గతేడాది కూడా రెండు సార్లు గ్రహ శకలాలు భూమికి చేరువగా వచ్చి వెళ్ళాయి. భవిష్యత్తులో భారీ గ్రహశకలాలు భూ గ్రహాన్ని ఢీకొట్టే ప్రమాదముందని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. సౌర వ్యవస్థలో గ్రహ శకలాల వయసును 4.6 బిలియన్ సంవత్సరాలుగా భావిస్తుంటారు. సౌర కుంటుంబంలో లక్షలాది గ్రహశకలాలున్నాయి. ఇప్పటివరకూ మొత్తం 26 వేల ఆస్టరాయిడ్స్‌ను నాసా గుర్తించింది. ఇందులో వెయ్యి గ్రహశకలాలను మాత్రం భూమికి ప్రమాదకరమైన వాటిగా గుర్తించిందిఆస్టరాయిడ్స్ అవి వెళ్లే దారిలో మరేదైనా గ్రహశకలం వాటిని ఢీకొంటే వాటి కక్ష్య మారిపోతుంది. గ్రహశకలాలు భూమివైపునకు రావడం వల్ల వచ్చే ప్రమాదాల నివారణకు అమెరికా, చైనా కసరత్తు చేస్తున్నాయి. గ్రహశకలంపై రాకెట్లను ప్రయోగించి శకలం దారి మరల్చే ప్రయత్నం చేయవచ్చని ఆలోచన చేస్తున్నాయి. ఇలాంటి గ్రహశకలాల్ని గమనించేందుకు నాసా దగ్గర ప్లానెటరీ డిఫెన్స్ సిస్టం ఉంది. త్వరలో నాసా? డబుల్ ఆస్టరాయడ్ రీడైరెక్షన్ టెస్ట్ మిషన్‌ను పంపబోతోంది. ఈ మిషన్ వేగంగా దూసుకెళ్లి 780 మీటర్ల సైజు ఉన్న ఆస్టరాయిడ్ డిడిమోన్ ను ఢీకొట్టనుంది. భవిష్యత్తులో ఏదైనా గ్రహశకలం భూమివైపు వస్తూ ఉంటే అది రాకముందే దాన్ని పేల్చేయాలన్నది నాసా ప్లాన్. అందులో ఇది తొలి ప్రయోగం. ఈ సంవత్సరం అక్టోబర్‌లో ఈ విధ్వంస ప్రయోగం జరగనుందని అంచనా వేస్తున్నారు. చైనా కూడా ఇటువంటి ప్రయోగంపైనే పరిశోధనలు చేస్తోంది. అమెరికా డార్ట్ మిషన్ విజయవంతం అయితే.. భూమి గ్రహశకలాల ముప్పు నుంచి కొంతవరకూ బయటపడినట్లు అవుతుంది.

6.6 కోట్ల సంవత్సరాల కిందట కొన్ని కిలోమీటర్ల సైజు ఉన్న ఓ గ్రహశకలం భూమిని ఢీకొట్టడందాని వల్ల భూమిపై ఉన్న జీవుల్లో మూడోవంతు అంతరించిపోయాయని ఖగోళ శాస్త్రవేత్తల అభిప్రాయం రాక్షస బల్లులు కూడా దాని వల్లే అంతరించిపోయాయని ఓ అంచనా ఉంది.

## విజయ్ - రష్మిక కలిసే

# న్యూ ఇయర్ సెలబ్రేట్ చేసుకున్నారా..?



సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ – లక్కీ బ్యూటీ రష్మిక మందన్నా జోడీకి సినీ అభిమానుల్లో ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'గీత గోవిందం' సినిమాలో ఆన్ స్క్రీన్ రొమాన్స్ తో అలరించిన ఈ జంట.. 'డియర్ కామ్రేడ్' మూవీలో మరోసారి అద్భుతమైన కెమిస్ట్రీని పండించారు. అలానే ఇద్దరూ కలిసి పలు కమర్షియల్ యాడ్స్ కూడా చేసారు.వెండితెర మీద ఫర్ఫెక్ట్ జోడీ అనిపించుకున్న విజయ్ – రష్మిక.. నిజ జీవితంలోనూ రిలేషన్ షిప్ లో ఉన్నారని అప్పట్లో పుకార్లు షికారు చేశాయి. ప్రస్తుతం వీరిద్దరూ బాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇద్దరి సినిమాల షూటింగ్స్ ముంబై లోనే జరుగుతుండటంతో వీలైనప్పుడల్లా కలుసుకోవడంతో రూమర్స్ మళ్ళీ తెర మీదకు వచ్చాయి.కన్నడ హీరో రక్షిత్ శెట్టితో కొన్నాళ్ళు ప్రేమాయణం సాగించిన రష్మిక మందన్నా.. ఆ మధ్య ఎంగేజ్మెంట్ కూడా క్యాన్సిల్ చేసుకున్న సంగతి తెలిసిందే. దీని తర్వాత విజయ్ – రష్మిక రిలేషన్ షిప్ లో ఉన్నారనే గుసగుసలు వినిపించాయి. అయితే ఇవేవీ పట్టించుకోని ఈ క్రేజీ జంట.. ఎవరి సినిమాలతో వాళ్లు బిజీగా గడుపుతున్నారు.2022 ప్రారంభంలో వీరి మధ్య ఏదో వ్యవహారం నడుస్తోందనే పుకార్లు మళ్లీ తెరపైకి వచ్చాయి. దీనికి కారణం విజయ్ దేవరకొండ – రష్మిక మందన్న కలిసి న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ చేసుకోవడమే అని తెలుస్తోంది. కొత్త సంవత్సరం వేడుకల్లో ఇద్దరూ కలిసినట్లు ఎక్కడా వెల్లడించనప్పటికీ.. రష్మిక – విజయ్ సోదరుడు ఆనంద్ దేవరకొండ ఇన్స్టాగ్రామ్ లలో షేర్ చేసిన ఫోటోలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయని నెటిజన్స్ అంటున్నారు.విజయ్ – ఆనంద్ – రష్మిక ఫోటోల బ్యాగ్రౌండ్ గమనిస్తే వీరు ముగ్గురూ ఒకే చోట ఉన్నారనే విషయం అర్థం అవుతుంది. బాలీవుడ్ ప్రేమ జంటలు విహారయాత్రలకు విదేశాలకు వెళ్ళినప్పుడు కలిసి వెళ్లారనే విషయం తెలియకుండా జాగ్రత్తలు పడుతుంటారు. ఇటీవల వివాహబంధంతో ఒకటైన లవ్ బర్డ్స్ విక్కీ కౌశల్ – కత్రినా కైఫ్ ఇలానే అనేక సందర్భాల్లో దొరికిపోయారు.ఇప్పుడు విజయ్ దేవరకొండ – రష్మిక కూడా కెమెరా కళ్ళకు చిక్కకుండా అదే ట్రెండ్ ను అనుసరించినప్పటికీ.. వారు కలిసి న్యూ ఇయర్ ని సెలబ్రేట్ చేసుకున్నారని ఇంస్టాగ్రామ్ ఫోటోలు సూచించాయి. ఇదే పుకార్లకు ఊతం ఇచ్చింది. అయితే ఇద్దరు హీరోహీరోయిన్లు కలిసి హాలిడేకి వెళ్లినంత మాత్రాన వారి మధ్య ఏదో ఉందని అనుకోవడం పొరపాటని.. వాళ్ళు బెస్ట్ ఫ్రెండ్స్ ఎందుకు కాకూడదని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు.ఇదిలా ఉంటే విజయ్ – రష్మిక ఇద్దరూ ఇప్పుడు బాలీవుడ్ లో సాలిడ్ ఎంట్రీ ఇచ్చే ప్రయత్నాల్లో ఉన్నారు. %ఎణ% 'లైగర్' అనే పాన్ ఇండియా సినిమా చేస్తున్నాడు. ఇటీవలే విడుదలైన గ్లిమ్స్ నార్త్ లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఇక 'మిషన్ మజ్ను' సినిమాతో రష్మిక హిందీలోకి అడుగుపెడుతోంది. మరి త్వరలోనే వీరిద్దరూ కలిసి సినిమా చేసి మరోసారి ఆడియన్స్ ని అలరిస్తారేమో చూడాలి.

# రాజమౌళి ఈ సర్ప్రైజ్ దాచేశాడా?



ఆర్ ఆర్ ఆర్.. దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారిన పేరిది. రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ చిత్రం చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ కలిసి నటించిన పాన్ ఇండియా మల్టీస్టారర్ ఇది. దాదాపు 400 కోట్ల భారీ బడ్జెట్ తో భారతీయ సినీ చరిత్రలోనే కనీ వినీ ఎరుగని తీరితో రూపొందిన ఈ మూవీ బిజినెస్ పరంగానూ చరిత్రని తిరగరాసింది.ప్రీ రిలీజ్ బిజినెస్ పరంగా ఈ మూవీ సంచలనం సృష్టించింది. ఏకంగా 890 కోట్లు ప్రీ రిలీజ్ బిజినెస్ చేయడం విశేషం. ఈ స్థాయిలో ఓ తెలుగు సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ చేయడం టాలీవుడ్ సినీ హిస్టరీలోనే తొలిసారి కావడంతో ఈ సినిమా హాట్ టాపిక్ గా మారింది. భారీ అంచనాల మధ్య జనవరి 7న ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 14 భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయాలని ప్లాన్ చేశారు. కానీ అనూహ్యంగా మారిన పరిస్థితులు ఒమిక్రాన్ కరోనా కేసులు ఉధృతంగా పెరుగుతుండటంతో పలు రాష్ట్రాల్లో నైట్ కర్ఫ్యూలు అమల్లోకి వచ్చేశాయి.దీంతో ఆర్ ఆర్ ఆర్ ని వాయిదా వేస్తున్నట్టుగా చిత్ర బృందం ప్రకటించేసింది. దీంతో షాక్ కు గురైన ప్రేక్షకులకు రాజమౌళి ఓ సర్ప్రైజ్ ని సిద్ధం చేశాడట. దాన్ని ఇప్పటి వరకు రివీల్ చేయకుండా సీక్రెట్ గా దాచేశాడని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ మూవీ కోసం ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేశారట. ఈ పాటని సైలెంట్ గా రామ్ చరణ్ ఎన్టీఆర్ లపై కొన్ని వారాల క్రితమే చిత్రీకరించారని తెలిసింది. ఈ ప్రత్యేక గీతం మగధీర ఎండ్ టైటిల్స్ లో టీమ్ మెంబర్స్ అందరితో కలిసి ఏర్పాటు చేసినట్టుగా ఆర్ ఆర్ ఆర్ సినిమా ముగింపులో వస్తుందనిఅయితే ఈ పాటలో కేవలం రామ్ చరణ్ ఎన్టీఆర్ మాత్రమే వుంటారని చెబుతున్నారు.ఈ పాటని చివరి వరకు సర్ ప్రైజింగ్ గా దాచేసి థియేటర్ లో మాత్రమే ఆడియన్స్ కి చూపించి వారిని సర్ ప్రైజ్ చేయాలని దర్శకుడు రాజమౌళి ప్లాన్ చేసినట్టుగా తెలుస్తోంది. ఈ ప్రత్యేక గీతంలో రామ్ చరణ్ ఎన్టీఆర్ తమ డ్యాన్సింగ్ స్టెప్పులతో అదరగొట్టేశారని ఇన్ సైడ్ టాక్. ఈ మూవీ రిలీజ్ జనవరి 7న అయితే ప్రత్యేకంగా షూట్ చేసిన పాటని విడుదల చేయాలని ప్లాన్ చేశారట. కానీ తాజా పరిస్థితుల నేపథ్యంలో ఈ పాట ని సీక్రెట్ గా అలాగే దాచేయాలని రాజమౌళి భావిస్తున్నారని చెబుతున్నారు. ఇదిలా వుంటే మూడేళ్లుగా ఈ సినిమా కోసం శ్రమించి తీరా విడుదల వాయిదా పడేసరికి హీరోలు రామ్ చరణ్ ఎన్టీఆర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారట. ఆర్ ఆర్ ఆర్ రిలీజ్ వాయిదా పడటంతో వేస్టయిన సమయాన్ని కవర్ చేసుకునే పనిలో ఇప్పుడు ఇద్దరు హీరోలు బిజీగా మారుతున్నట్టుగా తెలుస్తోంది. రామ్ చరణ్.. శంకర్ సినిమా పనుల్లో నిమగ్నం కాగా.. ఎన్టీఆర్.. కొరటాల సినిమా కోసం రెడీ అయిపోతున్నారు.

# ఇండియన్ టీమ్ మాజీ కెప్టెన్ బయోపిక్ లో అనుష్క!



బాలీవుడ్ బయోపిక్ ల సక్సెస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అందులోనూ క్రీడా నేపథ్యం తో ముడిపడిన ప్రముఖుల బయోపిక్ లకు సక్సెస్ రేటు గురించి చెప్పాల్సిన పనిలేదు. తాజాగా మరో బయోపిక్ కి రంగం సిద్దమైంది. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ 'జులన్ నిషిత్ గోస్వామి'పై సినిమా తెరకెక్కనుంది. ఇందులో అనుష్క శర్మ నిషిత్ గోస్వామి పాత్రలో నటిస్తుంది. చక్ ద ఎక్స్ ప్రెస్ టైటిల్ తో అనుష్క ప్రొడక్షన్ హౌజ్ క్లీన్ స్లేట్ ఫిల్మ్స్ నిర్మిస్తుంది. ఈ సినిమాకు 'పరి' డైరెక్టర్ ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇక అనుష్క శర్మ మూడేళ్ల గ్యాప్ తర్వాత ఈ సినిమాతో మళ్లీ కంబ్యాక్ అవుతోంది.పెళ్లైన తర్వాత అనుష్క ధాంపత్య జీవితానికి ఎక్కువ సమయం కేటాయించింది. ఈ క్రమంలో ఓ బిడ్డకు జన్మనిచ్చింది. అలా అనుష్క మూడేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉంది. తాజాగా మళ్లీ బయోపిక్ తో మేకప్ వేసుకుంటోంది. సినిమాకి సంబంధించిన ఓ వీడియోను అనుష్క ట్విట్టర్లో పోస్ట్ చేసింది. ఈ చిత్రానికి అభిషేక్ బెనర్జీ కథ..స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. త్వరలో షూటింగ్ ప్రారంభం కానుందని చిత్రబృందం వెల్లడించింది. ఈ చిత్రాన్ని నేరుగా నెట్ఫ్లిక్స్లో రిలీజ్ చేయనున్నారు.జులన్ గోస్వామి బయోపిక్ ని ఎంతో ఆసక్తికరంగా మలుస్తున్నారు. జులన్ గోస్వామి స్వస్థలం పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో లోని నాడియా జిల్లాలో చక్ దాహ. అక్కడ నుంచి లార్డ్స్ వరకూ ఆమె ప్రయాణం ఎలా సాగిందన్నది ఎంతో ఆసక్తికరంగా మలస్తున్నారు. మహిళల ప్రపంచకప్ ఫైనల్ లో ఇంగ్లాండ్ పై టీమ్ ఇండియా ఓటమిని హైలైట్ చేస్తున్నారు. క్రీడల్లో పురుషులే కాదు..మహిళలు రాణించగలరని చాటి చెప్పిన మహిళగా జులన్ కి మంచి పేరుంది. ఎంతోమంది మహిళా క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపారు . ఆమె కెరీర్ లో ఎన్నో అవార్డులు..రివార్డులు అందుకున్నారు. వాటిని సాధించడం కోసం ఆమె ఎంతగా శ్రమించారు? అన్నది సినిమాలో ప్రధానంగా హైలైట్ చేస్తున్నట్లు సమాచారం.

# 'శేఖర్'కి అనూప్ సాంగ్ హైలైట్ కానుందా?!





అనూప్ రూబెన్స్ ఇండస్ట్రీకి వచ్చి చాలాకాలమే అయింది. యంగ్ స్టార్ హీరోల సినిమాలతో బిజీగానే ఉంటూ వస్తున్నాడు. సీనియర్ స్టార్ హీరోలలో నాగార్జున ఆయనకు ఎక్కువగా ప్రోత్సహిస్తుంటారు. ఈ సారి ఆయన మరో సీనియర్ స్టార్ హీరో అయిన రాజశేఖర్ తో సినిమా చేస్తున్నాడు. 'శేఖర్' సినిమా కి ఆయనే సంగీత దర్శకుడు. తాజాగా ఈ సినిమా నుంచి ఒక లిరికల్ సాంగ్ ను వదిలారు. 'బొట్టూ బెట్టి .. కాటుకెట్టి వచ్చిందమ్మా సిన్నది' అంటూ ఈ పాట జానపద బాణీలో నడుస్తోంది. విజయ్ ప్రకాశ్ – రేవంత్ తో కలిసి ఈ పాటను అనూప్ ఆలపించాడు.ఇంతవరకూ అనూప్ రూబెన్స్ చేసిన ట్యూన్ కి ఇది భిన్నంగా .. కొత్తగా అనిపిస్తోంది .. వినిపిస్తోంది. అనూప్ ఎక్కువగా యూత్ మనసులకు పట్టేసే రొమాంటిక్ ఫీల్ ఉన్న పాటలను చేశాడు. పాట ఏదైనా .. సందర్భాన్ని .. నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని బాణీలు కట్టడంలో ఆయన సిద్ధహస్తుడు. లవర్స్ హృదయం బాగా తెలిసిన సంగీత దర్శకుడిగా ఆయన గురించి చెప్పుకుంటారు. '30 రోజులలో ప్రేమించడం ఎలా?' అనే సినిమాలోని 'నీలి నీలి ఆకాశం' పాటను అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ పాట కోసం సినిమాకి వచ్చిన వారు ఎక్కువ అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.అంతలా ఆ పాట యూత్ ను ఒక ఊపు ఊపేసింది. ఇప్పుడు 'శేఖర్' సినిమా కోసం అనూప్ చేసిన 'లవ్ గంటే మోగిందంట' పాట కూడా ఒక రేంజ్ లో దూసుకు పోతోంది. ఈ ఏడాది హిట్ సాంగ్స్ లో ఫస్టు జాయిన్ అయ్యే పాట ఇదేననే అభిప్రాయాలు సోషల్ మీడియా ద్వారా వ్యక్తమవుతున్నా యి. నిజంగా ఈ పాట ఆ రేంజ్ లో దున్నేస్తుందా లేదా అనేది రెండు మూడు రోజుల్లో తేలిపోనుంది. కెరియర్ పరంగా చూసుకుంటే రాజశేఖర్ కి హీరోగా ఇది 91వ సినిమా. ఈ సినిమాకి జీవిత దర్శకత్వం చేస్తున్నారు.అనూప్ రూబెన్స్ విషయానికి వస్తే చూడటానికి ఆయన చాలా సింపుల్ గా కనిపిస్తుంటాడు. తన సినిమాలకి సంబంధించిన ఈవెంట్స్ లో తప్ప మరెక్కడా ఆయన కనిపించడు. ఆ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్స్ లో లైవ్ లో సాంగ్స్ ప్లే చేయవలసి ఉంటేనే ఆయన వస్తాడు. ఇక తాను చేసిన పాటలు ఎంతటి హిట్ అయినా వాటి గురించి వరుస ఇంటర్వ్యూల్లో చెప్పే ప్రయత్నం చేయడు. నాలుగు గోడల మధ్య తన పనిని తపస్సు లా చేయడానికే ఆయన ఇష్టపడ తాడు తప్ప మీడియా నుంచి ఎక్కువ ఫోకస్ ను కోరుకోడు. తాను కాకుండా తన పాటతో మాట్లాడించడమే ఆయనకి ఇషమేమో!

# మొదటి సినిమాతోనే బాలీవుడ్ లో భారీ మార్క్ అందుకున్న ఐకాన్ స్టార్.!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన కెరీర్ లో పాన్ ఇండియన్ ఎంట్రీ తాను అనుకున్న దానికంటే ఎక్కువ స్థాయిలోనే వచ్చింది అని చెప్పాలి. తన మరో హ్యాట్రిక్ దర్శకుడు సుకుమార్ తో చేసిన లేటెస్ట్ భారీ చిత్రం "పుష్ప" తో తన నుంచి ఒక కొత్త అల్లు అర్జున్ ని ప్రెజెంట్ చెయ్యడమే కాకుండా తనకి హిందీ ప్రేక్షకుల్లో ఎంత మేర ఆదరణ ఉంది అనే ప్రశ్నకి కూడా తనని తానే టెస్ట్ పెట్టుకొని 200 శాతం సక్సెస్ అయ్యాడని చెప్పాలి.ప్రస్తుతం నెలకొన్న కరోనా పరిస్థితులు బాలీవుడ్ మార్కెట్ లో కేవలం 50 శాతం అక్యుపెన్సీ తోనే డీసెంట్ టార్గెట్ పెట్టుకొని బరిలోకి దిగిన ఐకాన్ స్టార్ తనకున్న ఆదరణ ఒక్క యూట్యూబ్ వరకే కాదు హిందీ ప్రేక్షకులు థియేటర్స్ వరకు వచ్చి ఈలలు వేసే వరకు ఉందని ప్రూవ్ చేసాడు. దానికి నిదర్శనమే తన పుష్ప సినిమా బాలీవుడ్ మార్కెట్ లో లేటెస్ట్ గా 70 కోట్ల వసూళ్ల మార్క్ ని అందుకోవడం.ఇది కూడా అనేక ఇబ్బందులు నడుమ రిలీజ్ అయ్యిన బన్నీ మొదటి సినిమాగా అందుకోవడం చిన్న విషయం కాదు. ఆల్రెడీ ఈ లెక్క ఇంకా పెరుగుతుంది అని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి మాత్రం ఐకాన్ స్టార్ రియల్ పాన్ ఇండియా స్టార్ అనిపించుకున్నాడు.



Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com